

రెవెన్యూ శాఖలో విపరీతం

పదుల సంఖ్యలో లేఖలతో దరఖాస్తులు

తలలు పట్టుకుంటున్న ఉన్నతాధికారులు

ప్రభుత్వ ఉద్యోగులు, అధికారుల బదిలీల్లో సిఫార్సుల జాతర సాగుతోంది. రెవెన్యూ బదిలీల్లో మరీ ఎక్కువ. సిఫార్సు లేఖలు వెల్లువెత్తుతున్నాయి. ఆర్డీఓల నుంచి తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లతోపాటు రెవెన్యూ ఉద్యోగులు కోరుకున్న చోటుకు వెళ్లడానికి సర్వశక్తులు ఒడ్డుతున్నారు. ఇప్పటికే జిల్లాలో కొలువుదీరిన తహసీల్దార్లలో అత్యధికంగా నచ్చిన చోట పోస్టింగ్ కోసం పైరవీలు చేసుకున్నట్లు తెలుస్తోంది. ప్రజాప్రతినిధుల సిఫార్సులు, ఒత్తిళ్లకు ఉన్నతాధికారులు తలొగ్గక తప్పదేమోననిపిస్తోంది.

- ఆంధ్రజ్యోతి, పుట్టపర్తి

సిఫార్సుల వెల్లువ..!

జిల్లాలో తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, ఆర్ఐలు, వీఆర్వోలు, సర్వేయర్లు కోరుకున్న చోటికి బదిలీ చేయించుకునేందుకు ఆయా నియోజకవర్గాల ప్రజాప్రతినిధులను ప్రసన్నం చేసుకుంటున్నారు. వారి సిఫార్సు లేఖలతో దరఖాస్తు చేసుకున్నట్లు తెలుస్తోంది. పెనుకొండ, పుట్టపర్తి, ధర్మవరం, కదిరి రెవెన్యూ డివిజన్లలో 32 మండలాల నుంచి పది మందిదాకా తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లతో పాటు రెవెన్యూ ఉద్యోగులు 200కిపైగా దరఖాస్తులు చేసుకున్నారు. ఆయా నియోజకవర్గాల్లో కోరుకున్న చోటికి రావాలనుకున్న కొందరు తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, సర్వేయర్లు, వీఆర్వోలు.. ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలతో పైరవీలు చేస్తున్నట్లు తెలుస్తోంది. తమకు అనుకూలమైన వారికి పోస్టింగ్ ఇప్పించేందుకు కూటమి నేతలు కసరత్తు చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో పనిచేసిన డిప్యూటీ తహసీల్దార్లు, ఆర్ఐలు, వీఆర్వోలు, సర్వేయర్లు కొంతమంది పక్కగ్రామాలు, మరికొందరు పక్క మండలాలకు వెళ్లేందుకు దరఖాస్తు చేసుకున్నట్లు తెలుస్తోంది. ఇలా ఒకే పోస్టుకు ఇద్దరు, ముగ్గురికి సిఫార్సు లేఖలు ఇచ్చినట్లు తెలుస్తోంది. దీంతో దేనిని పరిగణనలోకి తీసుకోవాలోనని అధికారులు తలలు పట్టుకుంటున్నట్లు తెలుస్తోంది.

వైసీపీతో అంటకాగిన వారికీ.. అందలమే..

గత వైసీపీ పాలనలో ఆ పార్టీ నేతలకు అడ్డంగా భూములు దోచిపెట్టి, వారితో అంటకాగిన కొందరు రెవెన్యూ అధికారులకు బదిలీపై వెళ్లాలని ప్రజాప్రతినిధులు హుకుం జారీ చేసినట్లు తెలుస్తోంది. పుట్టపర్తి, ధర్మవరం, పెనుకొండ, కదిరి డివిజన్ కార్యాలయాలతోపాటు పలు మండలాల్లో డిప్యూటీ తహసీల్దార్లు, వీఆర్వోలు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లను ఖాళీ చేయాలని చెప్పినట్లు సమాచారం. కొన్నిచోట్ల మాత్రం ఐదేళ్లు వైసీపీతో అంటకాగిన కొందరు అధికారులు.. స్థానిక నేతలతో ఒప్పందం కుదుర్చుకుని, పక్క మండలం గ్రామాలకు వెళ్లేలా సిఫార్సులు చేసుకున్నారు. ఇలా రెవెన్యూ శాఖ బదిలీల్లో ప్రజాప్రతినిధులు, నేతల సిఫార్సు లేఖలు లేనిదే కోరుకున్న చోటు దక్కే పరిస్థితి లేదన్న చర్చ సాగుతోంది. కోరుకున్న చోటికి పోస్టింగ్ కావాలంటే అంతో.. ఇంతో.. చెల్లించుకోవాలనీ, ఇప్పటికే ఆ స్థానానికి పోటీ ఉందని నమ్మబలుకుతూ కొందరు నేతలు బేరసారాలతో దుకాణం పెట్టినట్లు తెలుస్తోంది. ఆయా నియోజకవర్గాలు, మండలాల్లో బదిలీపై తహసీల్దార్ పోస్టింగ్ పొందాలంటే సిఫార్సు లేఖ ఉండాల్సిందేనన్న చర్చ నడుస్తోంది. ఈనేపథ్యంలో ప్రజాప్రతినిధులు, నేతల చుట్టూ కొందరు తహసీల్దార్లు, వీఆర్వోలు, ఆర్ఐలు ప్రదక్షిణ చేస్తున్నట్లు తెలుస్తోంది. కదిరి, పెనుకొండ, ధర్మవరం డివిజన్లలో వైసీపీతో అంటకాగిన పలువురు డిప్యూటీ తహసీల్దార్లతోపాటు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు బదిలీపై వెళ్లాలని భావిస్తున్నారు. పోస్టులు ఖాళీ అవుతున్న నేపథ్యంలో ఆ స్థానంలోకి వచ్చేందుకు పుట్టపర్తి, ధర్మవరం ప్రాంతాల నుంచి పలువురు డిప్యూటీ తహసీల్దార్లు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. పెనుకొండ, ధర్మవరం డివిజన్లలో ఆరుచోట్ల తహసీల్దార్ స్థానాల్లో చేరేందుకు పదిమందిదాకా పోటీ పడుతున్నట్లు తెలుస్తోంది. పారిశ్రామిక హబ్‌గా ఉన్న మండలకేంద్రానికి విజయవాడలో ఉన్న వైసీపీతో అంటకాగిన ఓ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌ను తీసుకొచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. కలెక్టరేట్‌లో కీలకమైన పోస్టులో చేరేందుకు ఓ డివిజన్ స్థాయి రెవెన్యూ అధికారి పలువురు ప్రజాప్రతినిధుల ద్వారా సిఫార్సు లేఖలు సిద్ధం చేసుకున్నారు. ఆయా నియోజకవర్గాల్లో పలు విభాగాల్లో అధికారుల జాబితా ఇప్పటికే సిద్ధం చేసి, వారినే పంపాలని ప్రజాప్రతినిధులు పట్టుబట్టారట. శనివారం నాటికే బదిలీల జాబితా సిద్ధమైనా.. గడువు పొడిగించిన నేపథ్యంలో ఏ స్థానంలో ఎవరు సిఫార్సు లేఖలతో చేరుతారో అన్న చర్చ సాగుతోంది.





ఉమ్మడి జిల్లాకు నీరందించే సత్యసాయి నీటి పథకం భవనం

వేతన వెతలు..

తాగునీటి కార్మికులకు ఆరు నెలలుగా అందని జీతాలు

దుర్భరంగా జీవితాలు



పంప్‌హౌస్‌లోని విద్యుత్ పరికరాలు




నీటిని సరఫరా చేసే మోటార్లు

తాడిమర్రి, సెప్టెంబరు 1: ఉమ్మడి జిల్లాలో సత్యసాయి నీటి పథకం కార్మికుల పరిస్థితి దుర్భరంగా తయారైంది. ఆరు నెలలుగా వేతనాలు అందక నానా అవస్థలు పడుతున్నారు. పథకం నిర్వహణను గత వైసీపీ పాలకులు గాలికొదిలేశారు. నిధులివ్వకుండా నీరుగార్చారు. పైపులైన్ల మరమ్మతులకు కూడా నిధులు మంజూరు చేయకపోవడంతో కార్మికులే అప్పులు చేసి, చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 810 గ్రామాలకు సత్యసాయి నీరు సరఫరా అవుతోంది. 572 మంది కార్మికులు పనిచేస్తున్నారు. 1998లో సత్యసాయి ప్రాజెక్టు ప్రారంభించినప్పటి నుంచి అందులో పనిచేస్తున్న కార్మికులు తమ జీవితాల్లో వెలుగులు నిండుతాయని ఆశిస్తూ గ్రామాల ప్రజల గొంతులు తడుపుతున్నారు. నెలలపాటు వేతనాలు రాకున్నా ఎప్పుడో ఒకసారి వస్తాయన్న ఆశతో పనిచేస్తున్నారు. వారికి ఎప్పుడు వేతనాలు రావాలన్నా.. రోడ్డెక్కి నిరసన తెలపాల్సిందే. గత ఐదేళ్లకాలంలో ఒక్కనెలలో కూడా వారు ఎవరినీ అడగకుండా జీతాలు తీసుకున్న పాపానపోలేదు. 810 గ్రామాల ప్రజలు ఒక్కసారి తమ గురించి ఆలోచించి, తమ కష్టాలు.. ప్రజాప్రతినిధులకు తెలియజేసి, వేతనాలు ఇప్పించేలా చూడాలని కోరుతూ ఇప్పటికే కరపత్రాలను పంపిణీ చేస్తున్నారు. ఈనెల 5వ తేదీ నుంచి నిరవధిక సమ్మెలోకి వెళ్లేందుకు వారు సిద్ధమవుతున్నారు.

చిన్నమరమ్మతులకు కూడా..

నీటి సరఫరాలో ఎక్కడైనా పైపులు పగిలిపోతే కార్మికులు అప్పు చేసి మరీ మరమ్మతులు చేసుకోవాల్సిందే. గత వైసీపీ హయాంలో తాగునీటి పథకాలకు నిధుల కేటాయింపు పూర్తిగా తగ్గిపోయింది. కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకపోవడంతో వారు చేతులెత్తేశారు. కార్మికులకు వేతనాలు ఇచ్చేందుకు కూడా వారు ముందుకు రావడం లేదు.

అప్పులు చేసి.. పిల్లల ఫీజులు కట్టా



ఆరు నెలలుగా వేతనాలు రాలేదు. జూలైలో పిల్లలను బడికి పంపినా ఫీజు నెలలేటుగా కడతామని ఒప్పించుకున్నా. వేతనం రాకపోవడంతో అప్పులుచేసి ఫీజులు చెల్లించా. ఎప్పుడు వేతనం తీసుకోవాలన్నా నిరసనకు దిగితే తప్ప.. రాని పరిస్థితి.

-మహేశ్‌రెడ్డి, సత్యసాయి కార్మికుడు

మా బాధలను ప్రభుత్వం గుర్తించాలి: ఓబులేసు, కార్మికుడు



మా బాధలను ప్రభుత్వం గుర్తించి, వేతనాలు నెలనెలా ఇవ్వాలి. 25 సంవత్సరాలుగా సంస్థలో పనిచేస్తున్నా.. వేతనాలు మాత్రం సక్రమంగా అందడంలేదు. ఈపీఎఫ్ సమస్య అలాగే ఉంది. ప్రభుత్వం ఉన్నతాధికారిని నియమించి, మా సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి.

వర్షపు నీరు నిలువకుండా చూడండి: కలెక్టర్

పుట్టపర్తి, సెప్టెంబరు 1: జిల్లాలో ఎక్కడా వర్షపు నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్.. సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆదివారం తన క్యాంపు కార్యాలయం నుంచి టెలీకాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్.. జిల్లాలోని అధికారులకు దిశానిర్దేశం చేశారు. కర్ణాటకలోని పలు ప్రాంతాల్లో అధిక వర్షాలు పడ్డాయనీ, జిల్లాలోని రొళ్ల, రొద్దం, లేపాక్షి, చిలమత్తూరు, మడకశిర ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసినట్లు నివేదికలు అందుతున్నాయన్నారు. వర్షపు నీరు రోడ్లపై గుంతల్లో నిల్వ ఉంటే రోగాలు ప్రబలు ప్రమాదం ఉందనీ, అప్రమత్తంగా ఉండాలంటూ ఆదేశించారు. తాగునీటి పైపులు లీకేజీ కాకుండా చూడాలనీ, సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలను అప్రమత్తం చేయాలని ఆదేశించారు. అవసరమైన ప్రాంతాలలో ట్యాంకర్ల ద్వారా సురక్షితమైన తాగునీరు అందించాలన్నారు. పంట, ఆస్తినష్టాలు, విద్యుత్, రహదారుల నష్టాల గురించి నివేదిక అందజేయాలన్నారు. మండల, డివిజన్ కేంద్రాల్లో కంట్రోల్ రూములు ఏర్పాటుచేసి సమాచారం తెలుసుకోవాలన్నారు. జిల్లా కేంద్రంలో కంట్రోల్ రూం 08555 292432 నంబరును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- ఎస్పీ రత్న

పుట్టపర్తి రూరల్, సెప్టెంబరు 1: తుఫాను ప్రభావం దృష్ట్యా జిల్లాలోని ముంపుప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ రత్న ఆదివారం ప్రకటనలో కోరారు. తుఫాను ప్రభావం జిల్లాలో రెండురోజులపాటు ఉంటుందన్నారు. కర్ణాటక ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాల దృష్ట్యా హిందూపురం, గోరంట్ల, పుట్టపర్తి, కేశాపురం, వెల్దుర్తి, ధర్మవరం, ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలకు పాతమిద్దెల్లో నివసిస్తున్న ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలన్నారు. ప్రజలు.. నదులు, వంకలు, వాగులను దాటనీయకుండా బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసు అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. ముంపు గ్రామాల్లో దండోరా వేయించి, ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు.

నేడు పాఠశాలలకు సెలవు

జిల్లాలోని అన్ని ప్రభుత్వ ప్రైవేటు విద్యాసంస్థలకు సెలవు ప్రకటిస్తున్నట్లు కలెక్టర్ టీఎస్ చేతన్ తెలిపారు. జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు.



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న ఎస్టీయూ నాయకులు

పాతపెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి

పుట్టపర్తి, సెప్టెంబరు 1: రాష్ట్రంలో అమలవుతున్న సీపీఎస్‌ను రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్‌రెడ్డి డిమాండ్ చేశారు. సీపీఎస్ విద్రోహ దినాన్ని పురస్కరించుకుని పలు ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం జిల్లావ్యాప్తంగా నిరసనలు వ్యక్తం చేశారు. ఎస్టీయూ ఆధ్వర్యంలో స్థానిక కలెక్టరేట్ వద్ద నిరసనకు దిగారు. జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ... సీపీఎస్, జీపీఎస్, యూపీఎస్ విధానాలను వ్యతిరేకిస్తున్నామన్నారు. ఓపీఎస్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ, భవిష్యత్తుకు భద్రతలేని సీపీఎస్‌ను రద్దు చేయాలని కోరుతూ రెండు దశాబ్దాలుగా పోరాడుతున్నా.. ప్రభుత్వాలు పట్టించుకోలేదన్నారు. ఇతర రాష్ట్రాల్లో సీపీఎస్‌ను రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తున్నారనీ, ఏపీలో మాత్రం కమిటీలతో కాలయాపన చేస్తున్నారన్నారు. వెంటనే ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు కోనంకి చంద్రశేఖర్, శ్రీనివాసులు, గోపాల్‌నాయక్, ప్రసాద్, జవహర్, లక్ష్మీప్రసాద్, సంపత్‌కుమార్, సుందరకుమార్ పాల్గొన్నారు.

తేలికపాటి వర్షాలు

పుట్టపర్తి రూరల్, సెప్టెంబరు 1: జిల్లావ్యాప్తంగా శనివారం రాత్రి తేలికపాటి వర్షాలు కురిసినట్లు వాతావరణ శాఖాధికారులు పేర్కొన్నారు. కనగానపల్లిలో అత్యధికంగా 12.4 మి.మీ, వర్షం కురిసిందన్నారు. రామగిరి 6.4, ధర్మవరం, గోరంట్ల 6.2, బత్తలపల్లి 5.0, ముదిగుబ్బ, కదిరి, కొత్తచెరువు 4.2, రొళ్ళ 3.2, తాడిమర్రి 2.6, చెన్నేకొత్తపల్లి, నల్లచెరువు 2.4, మడకశిర, పుట్టపర్తి, తనకల్లు 2.2, తలుపుల, గాండ్లపెంట 2.0, అమరాపురంలో 1.0 మి.మీ వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖాధికారులు పేర్కొన్నారు.

హీటర్ పట్టుకుని చేనేత కార్మికుడి మృతి



రంగస్వామి (ఫైల్)

ధర్మవరం, సెప్టెంబరు 1: స్థానిక చంద్రబాబునగర్‌లో చేనేత కార్మికుడు రంగస్వామి ఆదివారం రాత్రి విద్యుత్ హీటర్ పట్టుకుని మరణించాడు. టూటౌన్ పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు... లక్ష్మీనారాయణ, జయలక్ష్మి దంపతుల కుమారుడు రంగస్వామి కూలిమగ్గం నేస్తుండేవాడు. తండ్రి ఇదివరకే మరణించడంతో కూలి మగ్గం నేయడం ద్వారా వచ్చే సొమ్ముతో తల్లికితోడుగా ఉండేవాడు. నీటిని వేడి చేసుకునేందుకు హీటర్ చేతికి తీసులో పట్టుకుని, ఏదో ఆలోచిస్తూ బోర్డులో స్విచ్ ఆన్ చేశాడు. విద్యుత్ షాక్ తగిలి, అక్కడికక్కడే మృతిచెందాడు. టూటౌన్ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. రంగస్వామి తల్లి జయలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

జ్వరం బారిన జనం..!

గ్రామీణులు విలవిల

ఇంట్లో ఇద్దరు, ముగ్గురు బాధితులు



జ్వరంతో మంచానపడ్డ జెరిపిటి ప్రసాద్

ఓబుళదేవరచెరువు, సెప్టెంబరు 1: పల్లెలు మంచం పట్టాయి. జ్వరాలతో జనం విలవిల్లాడుతున్నారు. అసలే వర్షాకాలం, ఆపై మురుగు, వర్షపునీటితో చిన్నపాటి గుంతలు సైతం నిండిపోతున్నాయి. వాటిలో లార్వాలు పెరిగి దోమలు వృద్ధి చెందుతున్నాయి. వాటి దెబ్బకు జనం జ్వరాల బారినపడుతున్నారు. జ్వరంతోపాటు, దగ్గు, జలుబు, విపరీతమైన నొప్పులతో జ్వర పీడితులు అల్లాడిపోతున్నారు. మండలంలోని దిగువపల్లి బీసీ కాలనీలోని ఓ ప్రాంతంలో ఇంటికి ఇద్దరు, ముగ్గురు చొప్పున జ్వరాల బారినపడ్డారు. కుసుమవారిపల్లి, కొండకమర్ల, తుమ్మలకుంట్లపల్లి, నవాబుకోట, ఇలా ప్రతి గ్రామంలో జ్వరపీడితులున్నారు.

ఇంటింటా బాధితులు

మండలంలోని దిగువపల్లి, కుసుమవారిపల్లి, కొండకమర్ల, కొత్త బీసీ కాలనీ, ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ప్రాంతాలు, మండలకేంద్రంలోని బీసీ కాలనీ, మెయిన్ బజారు తదితర ప్రాంతాల్లో ప్రజలు జ్వరాల బారినపడి అల్లాడిపోతున్నారు. దిగువపల్లిలోని బీసీ కాలనీలో ఒక్కో ఇంట్లో ఇద్దరు, ముగ్గురు చొప్పున జ్వరాల బారినపడ్డారు. ఆ కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బంది పడాల్సి వస్తోంది. సుమిత్ర, ఆమె మూడేళ్ల కుమార్తె అవంతిక, రమణప్ప ఇంట్లో అతడితోపాటు అక్కులమ్మ, అశోక్, మరో ఇంట్లో నాగార్జున, గౌతమి, రూప, కౌసల్య, మెయిన్ బజారులో జెరిపిటి ప్రసాద్, హేమావతి ఇలా ఇంట్లో ఇద్దరు, ముగ్గురు జ్వరాలతో బాధపడుతున్నారు. అయినా వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడంలో వైద్య శాఖాధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ఆశా కార్యకర్తలువచ్చి చూసి వెళ్తున్నారే తప్ప.. మందులు, సూదులు వేయడం లేదని పలువురు జ్వరపీడితులు ఆవేదన చెందుతున్నారు.



జ్వరంతో బాధపడుతున్న సుమిత్ర

వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలి

జెపిరిటి రమణమ్మ, దిగువపల్లి



గ్రామంలో జ్వర బాధితులు రోజురోజుకీ పెరుగుతున్నారు. జ్వరాలు తగ్గేవరకు గ్రామంలో ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేయాలి. దోమల నివారణకు చర్యలు చేపట్టాలి.

జ్వరాలపై ఇంటింటా సర్వే

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇంటింటా జ్వరాల సర్వేతోపాటు లార్వా సర్వే చేపడుతున్నాం. జ్వరాలు ఎక్కువగా ఉన్న ప్రాంతంలో వైద్యసేవలందిస్తున్నాం. ఆశా కార్యకర్తల ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం.

- డాక్టర్ భానుప్రకాష్‌నాయక్, ప్రభుత్వ వైద్యాధికారి, ఓడీసీ

రేపు జాబ్‌మేళా

ధర్మవరం, సెప్టెంబరు 1: జిల్లాలోని నిరుద్యోగ యువతీయువకులకు స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈనెల 3న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ సురేశ్‌బాబు, రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి అబ్దుల్ ఖయ్యూం ఆదివారం ప్రకటనలో తెలిపారు. 6 కంపెనీలు ఇంటర్వ్యూలు నిర్వహిస్తాయన్నారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, పీజీ, డిప్లొమా పూర్తిచేసిన 18 నుంచి 35 ఏళ్లలోపు వారు అర్హులన్నారు. అభ్యర్థులు బయోడేటా, ఆధార్‌కార్డు, విద్యార్హత పత్రాలు తీసుకుని, ఉదయం 9 గంటలకు హాజరు కావాలన్నారు.

వీళ్లకు బదిలీలు లేవా ?

మండలాధీశులుగా ఎంఈఓలు

ఏళ్ల తరబడి ఒకే మండలంలో తిష్ట

విద్యాశాఖలో రెగ్యులర్ ఎంఈఓలకు ట్రాన్స్‌ఫర్లు ఏవీ?

రాష్ట్రస్థాయిలో బదిలీలకు బ్రేక్ వేయిస్తున్న వైనం

జిల్లాలో 31 మండలాలకు 27 మంది..

అనంతపురం విద్య, సెప్టెంబరు 1: మండలాల్లోని ఎంపీడీఓలు, తహసీల్దార్లు, ఎస్ఐలు, ఇతర శాఖల నుంచి మండల స్థాయిలో పనిచేసిన అధికారులు రెండేళ్లు, మూడేళ్లకు బదిలీ అవుతుంటే ఎంఈఓ-1లు మాత్రం ఏడేళ్లు, 9 ఏళ్లు, 12 ఏళ్లుగా ఎక్కడి వారు అక్కడే ఉన్నారు. మండలాలను సొంత సామ్రాజ్యాలుగా మార్చుకుని మకుటం లేని మారాజుల్లా చెలరేగిపోతున్నారు. బదిలీ కాకుండా మండలాధీశులుగా మారిన మండల విద్యాశాఖాధికారుల వైఖరిపై చాలా మండలాల్లో ఉపాధ్యాయులు, సంఘాల నాయకులు గుర్రుగా ఉన్నారు. మెజార్టీ ఎంఈఓలను మార్చాలంటూ విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, సంఘాల నాయకులు, రాజకీయ నాయకులు సైతం కోరుతున్నారు. కానీ విద్యాశాఖ ఆ దిశగా అడుగేసిన ప్రతిసారి కొందరు ఎంఈఓలు, సంఘాల నాయకులు రాష్ట్ర స్థాయిలో చక్రం తిప్పి బ్రేక్ వేయిస్తున్నారు.

కొందరికి రెండు మండలాల బాధ్యత

జిల్లావ్యాప్తంగా 31 మండలాలు ఉన్నాయి. 31 మండలాలకు 27 మంది మండల విద్యాశాఖాధికారులుగా వ్యవహరిస్తున్నారు. వీరిలో కొందరు ఎంఈఓలు రెండేసి మండలాలకు బాధ్యులుగా పనిచేస్తున్నారు. ముఖ్యంగా కణేకల్లు ఎంఈఓగా లక్ష్మణ్ణ వ్యవహరిస్తున్నారు. ఆయన డీ హీరేహాళ్ మండలానికి సైతం ఎఫ్ఏసీ ఎంఈఓగా పనిచేస్తున్నారు. రాయదుర్గం ఎంఈఓగా నాగమణి పనిచేస్తున్నారు. ఆమె గుమ్మఘట్టకు కూడా ఎఫ్ఏసీ ఎంఈఓగా వ్యవహరిస్తున్నారు. కళ్యాణదుర్గం ఎంఈఓగా పనిచేస్తున్న విజయకుమారి కంబదూరు మండలానికి ఎఫ్ఏసీ ఎంఈఓగా కూడా విధులు నిర్వర్తిస్తున్నారు. బ్రహ్మసముద్రం ఎంఈఓగా పనిచేస్తున్న ఓబుళపతి కుందుర్పి మండలానికి సైతం ఎఫ్ఏసీ ఎంఈఓగా వ్యవహరిస్తున్నారు.





నార్పల మండల విద్యాశాఖ కార్యాలయం

స్థాన బలమే మిన్న...

మండలాల్లో ఎక్కువకాలం ఒకే చోట ఉండటం కొందరు ఎంఈఓలకు బలం చేకూరుస్తోంది. చాలా మంది 12 ఏళ్లు, ఏడేళ్లకు పైగా పాతుకుపోయారు. ఏళ్ల తరబడి బదిలీలు లేకపోవడంతో కొందరు ఎంఈఓలు స్థాన బలంతో చెలగేరిపోతున్నారు. ప్రైవేట్ స్కూళ్లకు ప్రతి ఏటా అరలక్ష, వీలైతే లక్ష రూపాయలు ఇలా ఫిక్స్ చేసి దండుకుంటున్నారన్న విమర్శలున్నాయి. ముఖ్యంగా నియోజకవర్గ కేంద్రాలు, నగరం, ప్రధాన పట్టణాలు మండల కేంద్రాలు ఉన్న ప్రాంతాల్లోని ఎంఈఓలు హవా సాగిస్తున్నారు. నిబంధనలు పాటించని కార్పొరేట్, ప్రైవేట్ స్కూళ్ల నుంచి ముక్కు పిండి ప్రతి ఏటా డబ్బులు లాగుతున్నారు. దీనికి తోడు స్కూళ్ల అనుమతులు, గుర్తింపు, రెన్యువల్ సందర్భాల్లో మరింత గుంజుతున్నారన్న ఆరోపణలు బలంగా ఉన్నాయి. ఇక ప్రభుత్వ రంగ విద్యాసంస్థల్లో ఉపాధ్యాయులు, ఇతర సిబ్బందికి సంబంధించిన వ్యవహారాల్లో మరీ చెప్పనక్కరలేదు. టీచర్లను సర్దుబాటు చేయడం, జీతాల నమోదు, మధ్యాహ్న భోజనం బిల్లులు, నాడు-నేడు పనులు, ఇతర అభివృద్ధి కార్యక్రమాల్లో చాలా మంది ఎంఈఓలు చేతివాటం ప్రదర్శిస్తున్నా రు. ఎక్కువ కాలం ఉన్నచోటే ఉండటం వల్ల పలువురు ఎంఈఓలు తమ పవర్ చెలాయిస్తూ పైరవీలు చేస్తూ లక్షలు పోగేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

బదిలీ భయమే లేదు...

విద్యాశాఖలో పలు మండలాల్లో పనిచేస్తున్న ఎంఈఓలు బదిలీలు మర్చిపోయారు. విద్యాశాఖ బదిలీలు నిర్వహించకపోవడమే కారణం. ముగ్గురు ఎంఈఓలు 12 ఏళ్లకు పైగా ఒకే మండలంలో పనిచేస్తుండగా, మెజార్టీ మండల విద్యాశాఖాధికారులు ఏడేళ్లకుపైగా అదే స్థానాల్లో కొనసాగుతున్నారు. అయితే అన్ని శాఖల్లో పనిచేస్తున్న అధికారులకు ఏదో ఒక ఏడాదిలో బదిలీలు వస్తూనే ఉన్నాయి. కానీ విద్యాశాఖ మాత్రం ఎంఈఓ-1 లకు బదిలీలు చేపట్టకపోవడంతో కొందరు ఇష్టారాజ్యంగా వ్యవహరి స్తున్నారు. చాలామంది స్థానికంగా ఉండటంతో పాటు, ఉపాధ్యాయ సంఘాల నేతలతో గ్రూపులు కట్టడం, స్థానిక రాజకీయ నాయకులతో బలమైన పరిచయాలు ఉండటంతో కొందరు ఎంఈఓలు అంతాతామై వ్యవహరిస్తున్నారన్న ఆరోణలున్నాయి. డీఈఓలతో సైతం లెక్కలేనితనంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు మూటగట్టుకుంటున్నారు. కొందరు ఎంఈఓల వైఖరి చూసిన ఉపాధ్యాయ సంఘాల నాయకులు, సామాన్య టీచర్లు, స్కూళ్ల కరస్పాండెంట్లు ఎప్పుడు వీళ్లను బదిలీ చేస్తారా అంటూ అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఎంఈఓల బదిలీలపై వివరణ కోసం ఆర్‌జేడీ శామ్యూల్‌ను ఆదివారం ఫోన్‌లో సంప్రదించగా...ఆయన అందుబాటులోకి రాలేదు.

మండలం	ఎంఈఓ పేరు	ఏ రోజు నుంచి	రెగ్యులర్ లేదా ఎఫ్ఏసీ	ఎన్నేళ్లుగా పనిచేస్తున్నారు
అనంతపురం	వెంకటస్వామి	07-07-2012	రెగ్యులర్	12 ఏళ్లకు పైగా
ఆత్మకూరు	నరసింహారెడ్డి	27-03-2017	రెగ్యులర్	7 ఏళ్లకుపైగా
బెళుగుప్ప	మల్లారెడ్డి	03-07-2023	రెగ్యులర్	ఏడాదికిపైగా
బొమ్మనహాళ్	వీరన్న	15-07-2023	ఎఫ్ఏసీ	ఏడాదికిపైగా
బ్రహ్మసముద్రం	ఓబుళపతి	27-03-2017	ఎఫ్ఏసీ	7 ఏళ్లకు పైగా (06.08.2022నుంచి కుందుర్పి మండలం ఎఫ్ఏసీ కూడా)
బుక్కరాయసముద్రం	నవీద	16.5.2024	ఎఫ్ఏసీ	3నెలలకుపైగా
కణేకల్లు	లక్ష్మన్న	03-07-2023	రెగ్యులర్	ఏడాదికిపైగా (21.7.2023 నుంచి డీ.హీరేహాళ్ మండలం ఎఫ్ఏసీ కూడా)
గార్లదిన్నె	తారాచంద్రానాయక్	27.03.2017	రెగ్యులర్	7ఏళ్లకుపైగా
గుత్తి	రవినాయక్	27.03.2017	రెగ్యులర్	7ఏళ్లకుపైగా
రాయదుర్గం	నాగమణి	27.03.2017	రెగ్యులర్	7ఏళ్లకుపైగా (15.2.2023 నుంచి గుమ్మఘట్ట మండలం ఎఫ్ఏసీ కూడా)
గుంతకల్లు	మస్తాన్‌రావు	03.07.2023	రెగ్యులర్	ఏడాదికిపైగా
కళ్యాణదుర్గం	విజయకుమారి	27.03.2017	రెగ్యులర్	7 ఏళ్లకు పైగా (18.07.2023కంబదూరు మండలం ఎఫ్ఏసీ కూడా)
కూడేరు	చంద్రశేఖర్	27.03.2017	రెగ్యులర్	7 ఏళ్లకు పైగా
నార్పల	క్రిష్ణయ్య	07.07.2012	రెగ్యులర్	12 ఏళ్లకుపైగా
పామిడి	జయనాయక్	27.03.2012	రెగ్యులర్	12 ఏళ్లకుపైగా
పెద్దపప్పూరు	హెచ్.శ్రీదేవి	03.07.2023	రెగ్యులర్	ఏడాదికిపైగా
పెద్దవడుగూరు	రాముడు	27.03.2017	రెగ్యులర్	7 ఏళ్లకుపైగా
పుట్లూరు	పి.శ్రీదేవి	27.03.2017	రెగ్యులర్	7 ఏళ్లకుపైగా (ప్రస్తుతం గుత్తి డిప్యూటీ డీఈఓ కూడా)
రాప్తాడు	మల్లికార్జున	27.11.2014	రెగ్యులర్	9 ఏళ్లకు పైగా
శెట్టూరు	శ్రీధర్	27.03.2017	రెగ్యులర్	7 ఏళ్లకుపైగా
శింగనమల	నరసింహరాజు	27.03.2017	రెగ్యులర్	7 ఏళ్లకుపైగా
తాడిపత్రి	నాగరాజు	27.03.2017	రెగ్యులర్	7 ఏళ్లకుపైగా
ఉరవకొండ	ఈశ్వరప్ప	27.03.2017	రెగ్యులర్	7 ఏళ్లకుపైగా
వజ్రకరూరు	ఎర్రిస్వామి	27.03.2017	రెగ్యులర్	7 ఏళ్లకుపైగా
విడపనకల్లు	శ్రీనివాసరావు	03.07.2023	రెగ్యులర్	ఏడాదికిపైగా (ప్రస్తుతం అనంతపురం డిప్యూటీ డీఈఓ కూడా)
యాడికి	కేశప్ప	27.03.2017	రెగ్యులర్	7 ఏళ్లకుపైగా
యల్లనూరు	ఎల్.పి.చంద్రశేఖర్	27.03.2017	రెగ్యులర్	7 ఏళ్లకుపైగా

వీరాంజనేయులుకు ఘన నివాళి



వీరాంజనేయులుకు నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే కాలవ, నాయకులు

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 1: టీడీపీ సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడు వీరాంజనేయులుకు పలువురు ఎమ్మెల్యేలు, టీడీపీ నాయకులు ఘనంగా నివాళులు అర్పించారు. స్థానిక జీఆర్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం వీరాంజనేయులు సంస్మరణ సభ నిర్వహించారు. ఎమ్మెల్యేలు కాలవ శ్రీనివాసులు, ఎంఎస్ రాజు, జాతీయ ప్రధాన కార్యదర్శి వైకుంఠం ప్రభాకర్ చౌదరి, జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరి, మాజీ మేయర్ స్వరూప, డీసీఎంఎస్ మాజీ ఛైర్మన్ జయచంద్రనాయుడు తదితరులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీకి వీరాంజనేయులు చేసిన సేవలు మరువలేనివని కొనియాడారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు. రాష్ట్ర నాయకులు తలారి ఆదినారాయణ, ఆలం నరసానాయుడు, ముంటిమడుగు కేశవరెడ్డి, రామలింగారెడ్డి, రాయల్ మురళీ, దేవళ్ల మురళీ, సరిపూటి రమణ, లక్ష్మీనరసింహ, వెంకటప్ప, సింగవరం రవి, గోనుగుంట్ల విజయ కుమార్, డాక్టర్లు ప్రదీప్ చౌదరి, రోహిత్‌రెడ్డి, రామమోహన్ పాల్గొన్నారు.

గుంతకల్లు డివిజన్ మీదుగా రైళ్ల మళ్లింపు

గుంతకల్లు, సెప్టెంబరు 1: వర్షాల కారణంగా పలు రైళ్లను గుంతకల్లు రైల్వే డివిజన్ మీదుగా మళ్లించినట్లు రైల్వే అధికారులు ఆదివారం తెలిపారు. వరంగల్లు మీదుగా వెళ్లే బెంగళూరు-పాట్నా వెళ్లే ఎక్స్‌ప్రెస్ (నెం. 22354)ను 1వ తేదీన ధర్మవరం, గుంతకల్లు, సులేహళ్లి, సికింద్రాబాద్, ఖాజీ పేట్ మీదుగా మళ్లించినట్లు తెలియజేశారు. అదేవిధంగా ఖమ్మం మీదుగా వెళ్లే యశ్వంతపూర్-టాటానగర్ ఎక్స్‌ప్రెస్ (నెం. 18112) రైలును 1వ తేదీన బళ్లారి-గుంతకల్లు-గుత్తి-నంద్యాల-గుంటూరు-విజయవాడ మీదుగా మళ్లించామన్నారు. సికింద్రాబాదు-తిరుపతి ఎక్స్‌ప్రెస్ (నెం. 12764) రైలును 1వ తేదీన జన్‌గావ్-శ్రీకాళహస్తి రూటులో కాకుండా సికింద్రాబాద్, గుంతకల్లు, కడప, రేణిగుంట మీదుగా తిప్పి పంపినట్లు వివరించారు. 1వ తేదీన విజయవాడ-వరంగల్లు మీదుగా వెళ్లే తిరునవేలి-బిలాస్‌పూర్ ఎక్స్‌ప్రెస్ (నెం. 22620)ను రేణిగుంట-గుత్తి-డోన్-కాచిగూడ ఖాజీపేట్ మీదుగా, వరంగల్లు మీదుగా వెళ్లే కోచివేలి-గోరఖపూర్ ఎక్స్‌ప్రెస్ (నెం. 12512)ను కాట్పాడి, రేణిగుంట, గుత్తి, డోన్, కాచిగూడ, ఖాజీపేట్ మీదుగా, ఖమ్మం మీదుగా వెళ్లే త్రివేండ్రం-న్యూఢిల్లీ ఎక్స్‌ప్రెస్ (నెం. 12526)ను రేణిగుంట, గుంతకల్లు, సులేహళ్లి, సికింద్రాబాద్, ఖాజీపేట్ మీదుగా మళ్లించడం జరిగిందన్నారు. రామేశ్వరం-అయోధ్య వెళ్లే ఎక్స్‌ప్రెస్ (నెం. 22613)ను కాట్పాడి, రేణిగుంట, గుత్తి, డోన్, కాచిగూడ, ఖాజీపేట్ మీదుగా, గయ-చెన్నై వెళ్లే ఎక్స్‌ప్రెస్ (నెం. 12389) రైలును బాలార్షా, ఖాజీపేట్, సికింద్రాబాద్, సులేహళ్లి, గుంతకల్లు, విజయవాడ మీదుగా మళ్లించామన్నారు. అదేవిధంగా ఈ 2వ తేదీన అరక్కోణం-వరంగల్లు మీదుగా వెళ్లాల్సిన మధురై-చండీఘర్ ఎక్స్‌ప్రెస్ (నెం.12687)ను రేణిగుంట, గుంతకల్లు, సూలేహళ్లి, సికింద్రాబాద్, ఖాజీపేట్ మీదుగా, దానాపూర్-బెంగళూరు వెళ్లే సంఘమిత్ర ఎక్స్‌ప్రెస్ (నెం. 12295)ను ధర్మవరం, గుంతకల్లు, సులేహళ్లి, సికింద్రాబాద్, ఖాజీపేట్ మీదుగా మళ్లించనున్నట్లు తెలిపారు.

పీఏబీఆర్‌లోకి హంద్రీనీవా నీరు

కూడేరు, సెప్టెంబరు 1: పెన్నహోబిళం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లోకి జీడిపల్లి రిజర్వాయర్‌ను నుంచి హంద్రీ నీవా నీరు వస్తోంది. మూడు రోజులుగా జీడిపల్లి రిజర్వాయర్ నుంచి 99 క్యూసెక్కుల నీరు పీఏబీఆర్‌లోకి వస్తోందని ఇరిగేషన్ ఏఈ లక్ష్మీదేవి ఆదివారం తెలిపారు. తుంగభద్ర డ్యాం నుంచి 459 క్యూసెక్కులతోపాటు జీడిపల్లి నుంచి 99 క్యూసెక్కుల నీరు వస్తుండటంతో పీఏబీఆర్‌లో 1.657 టీఎంసీల నీరు నిల్వ ఉందని ఏఈ పేర్కొన్నారు.

దరఖాస్తు చేసుకోండి

కొత్తచెరువు, సెప్టెంబరు 1: సమగ్రశిక్షణ కార్యాలయంలో ఖాళీగా ఉన్న సెక్టోరియల్, అసిస్టెంట్ సెక్టోరియల్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారిణి మీనాక్షి ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఈనెల 7వతేదీ సాయంత్రం 5 గంటలలోపు దరఖాస్తులు, విద్యార్హతపత్రాలను బుక్కపట్నంలోని సమగ్రశిక్షణ కార్యాలయంలో అందజేయాలన్నారు.

ఖాళీల వివరాలు: ఇన్‌క్లూజ్ ఎడ్యుకేషన్ కో ఆర్డినేటర్, ఆల్టర్‌నేటివ్ స్కూల్ కో ఆర్డినేటర్, ప్లానింగ్ అండ్ మిస్ కో ఆర్డినేటర్, కమ్యూనిటీ మొబలైజేషన్ ఆఫీసర్, అసి అకాడమిక్ మానటరింగ్ కో ఆర్డినేటర్ (జనరల్), ఆసీ బాలికా శిశు అభివృద్ధి అధికారి (మహిళా టీచర్ మాత్రమే), అసిస్ట ఇన్‌క్లూజివ్ ఎడ్యుకేషన్ కో ఆర్డినేటర్, అసిస్టెంట్ ప్రోగ్రామింగ్ ఆఫీసర్ ఒక్కొక్క పోస్టు ఖాళీలు ఉన్నాయి. అసిస్టెంట్ స్టాటికల్ ఆఫీసర్ రెండు పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు.

సజావుగా యూపీఎస్సీ పరీక్షలు

అనంతపురం టౌన్, సెప్టెంబరు 1: యూపీఎస్సీ పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా జరిగాయి. జిల్లాకేంద్రంలోని జేఎన్‌టీయూ కాలేజ్ ఇంజనీరింగ్ ప్రధాన భవనంలో కంబైన్డ్ డిఫెన్స్ సర్వీసెస్ ఎగ్జామినేషన్ రెండు కేంద్రాల్లో, కేఎస్ఎన్ డిగ్రీ మహిళా డిగ్రీ కళాశాలలో నేషనల్ డిఫెన్స్ అండ్ నావల్ అకాడమీ ఎగ్జామినేషన్ రెండు కేంద్రాల్లో నిర్వహించారు. ఎక్కడా ఎటువంటి పొరపాటు జరగకుండా పకడ్బందీగా పరీక్షలు జరిగేలా చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ శివనారాయణ శర్మ అధికారులను ఆదేశించారు. పరీక్షా కేంద్రాలను ఆయన పరిశీలించారు.

దులీప్ ట్రోఫీ నిర్వహణపై ప్రత్యేక దృష్టి



సూచనలు, సలహాలు ఇస్తున్న ఎస్పీ జగదీష్



మైదానాన్ని పరిశీలిస్తున్న బీసీసీఐ ప్రతినిధులు

ఆటగాళ్ల భద్రతకు ప్రాధాన్యం: ఎస్పీ జగదీష్

ఏసీజీ, బసచేసే ప్రాంతాల పరిశీలన

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 1: దులీప్‌ట్రోఫీ నిర్వహణపై ప్రత్యేకదృష్టి సారించామని, ఆటగాళ్ల భద్రతకు ప్రాధాన్యత ఇస్తామని అనంతపురం జిల్లా ఎస్పీ జగదీష్ తెలిపారు. ఈనెల 5వ తేదీ నుంచి 22వ తేదీ వరకు అనంతపురం క్రికెట్ గ్రౌండ్, ఆటగాళ్లు బసచేసే మాసినేని, అలెగ్జాండర్ హోటళ్లను ఆదివారం ఎస్పీ జగదీష్ పరిశీలించారు. ఏసీజీ, బసచేసే హోటళ్ల వద్ద తీసుకోవాల్సిన భద్రతా చర్యలపై పోలీసులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆటగాళ్లు ఏసీజీకి వెళ్లే రూట్లపై ఆరాతీశారు. డ్రెస్సింగ్ రూంలు, పార్కింగ్ ప్రదేశాలు, ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్లు, గ్యాలరీలు, ఏఎస్‌వీలో ఆయా ప్రాంతాలను నిశితంగా పరిశీలించారు. ఎటువంటి ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా వాహనాల రాకపోకలకు సరైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. 300 మందికిపైగా పోలీసులతో బందోబస్త్ ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రూరల్ డీఎస్పీ శివారెడ్డి, ఏఆర్ డీఎస్పీ మునిరాజ్, సీఐలు రాజేంద్రనాథ్ యాదవ్, శ్రీకాంత్, శ్రీహర్ష, ఆర్ఐ రాముడు, ఎస్ఐ రామకృష్ణ పాల్గొన్నారు.

ఏసీజీని పరిశీలించిన బీసీసీఐ ప్రతినిధులు

బీసీసీఐ ప్రతినిధులు ఆదివారం అనంతపురం క్రికెట్ గ్రౌండ్‌ను పరిశీలించారు. వర్షం పడుతుండడంతో పిచ్ పరిస్థితి, ఆటపై పడే ప్రభావాన్ని అంచనా వేశారు. బీసీసీఐ ఆపరేషన్ మేనేజర్ అమిత్ సిద్దేశర్, క్యూరేటర్ సమందర్‌సింగ్ పిచ్‌ను, ప్రాక్టీస్ చేయడానికి నెట్‌లను పరిశీలించారు. అటు బౌలింగ్, బ్యాటింగ్, ఫీల్డింగ్, కీపింగ్ అంశాలకు సంబంధించి పిచ్ ఏవిధంగా ప్రభావం చూపుతుందో చర్చించారు. ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ జనరల్ మేనేజర్ రోహిత్‌వర్మ, అసిస్టెంట్ మేనేజర్ ఆదిత్యవర్మ, మీడియా మేనేజర్ రాజగోపాల్, దులీప్‌ట్రోఫీ ఆర్గనైజింగ్ కమిటీ సెక్రటరీ షాబుద్దీన్, సభ్యులు ఆర్డీటీ స్పోర్ట్స్ డైరెక్టర్ సాయికృష్ణ, కోచ్ యుగంధర్‌రెడ్డి తదితరులు ట్రోఫీ నిర్వహణ చర్యల్లో పాల్గొన్నారు.

ప్రతి పనికీ.. ఓ రేటు

ఏ పని జరగాలన్నా డబ్బులివ్వాల్సిందే..

పనిని బట్టి రేటు నిర్ణయించి వసూలు చేస్తున్న ఓ అధికారి

ఇదీ కళ్యాణదుర్గం తహసీల్దార్ కార్యాలయంలోని దుస్థితి

కళ్యాణదుర్గం, సెప్టెంబరు 1: ఆ తహసీల్దార్ కార్యాలయంలో ప్రతి పనికి ఓ రేటు ఉంది. ముఖ్యంగా ఓ అధికారి పనిని బట్టి రేటు నిర్ణయించి దర్జాగా వసూలు చేస్తున్నాడు. ఆ అధికారి అడిగినంత ఇవ్వకపోతే పనులు ఏ మాత్రం ముందుకు సాగవు. దీంతో పనులు జరగాలంటే ఆ అధికారి చెప్పినట్లుగానే డబ్బులు ముట్టజెప్పాల్సిందే. ఈ దుస్థితి కళ్యాణదుర్గం తహసీల్దార్ కార్యాలయంలో నెలకొంది. ఆ అధికారి అవినీతి గురించి కార్యాలయ సిబ్బందే బహిరంగంగా విమర్శిస్తున్నారు. దీన్నిబట్టి చూస్తుంటే ఆ అధికారి అవినీతి ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. ఆయన గత వైసీపీ ప్రభుత్వంలో ఆ పార్టీ నాయకులతో కుమ్మక్కై ఇష్టానుసారంగా అక్రమాలకు ఆజ్యం పోశాడు. అన్ని అర్హతలు ఉన్నా.. పట్టాదారు పాసుపుస్తకం ఇవ్వడానికి సవాలక్ష అంక్షలు విధిస్తాడు. అదే డబ్బు ఇస్తామని ఎవరైనా ముందుకొస్తే.. క్షణాల్లోనే పట్టాదారుపాసుపుస్తకాల మంజూరుకు అనుమతులు లభిస్తాయి. గత ఐదేళ్ల నుంచి పనిచేస్తున్న ఆ అధికారి అవినీతి అంతా ఇంతా కాదని ప్రజలు బహిరంగంగా చర్చించుకుంటున్నారు. చివరికి ఎన్ఓసీ సర్టిఫికెట్ మంజూరు చేయడానికి రూ. 10 లక్షల దాకా వసూళ్లకు పాల్పడినట్లు తెలిసింది. ఆ కార్యాలయంలో ఆ అధికారే కీలకం. రెవెన్యూ పనులు చక్కదిద్దడంలోనూ సిద్ధహస్తుడు. కార్యాలయంలో అక్రమమైనా, సక్రమమైనా ఆ అధికారి వద్దకు వెళ్లాల్సిందే. ఉన్నతాధికారులకు ఆ అధికారి చెప్పిందే వేదమనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రాత్రి 7 నుంచి 8 గంటల సమయంలో డిజిటల్ కీ ద్వారా అన్ని పనులు చక్కదిద్దుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఆ అధికారి అవినీతి ఎక్కువైపోవడంతో ఇక ఒత్తిళ్లు, వేధింపులు ప్రారంభమవుతాయని గ్రహించి బదిలీ ప్రయత్నాల్లో ముమ్మరంగా ఉన్నట్లు తెలిసింది. కొద్దిరోజుల క్రితం తహసీల్దార్ కార్యాలయం సమీపంలో ఏసీబీ అధికారులు సంచరించినట్లు తెలిసింది. దీంతో ఏసీబీ అధికారులు వస్తున్నారన్న సమాచారంతో ఆ అవినీతి అధికారితో పాటు తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది పత్తాలేకుండా పోయారని సమాచారం. ఇప్పటికే అవినీతి అధికారిపై ఏసీబీ అధికారులకు కూడా బాధితులు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఆ అధికారి లక్షలాది రూపాయలు ఆర్జించినట్లు విశ్వసనీయ సమాచారం. ఏదిఏమైనా ఉన్నతాధికారులు స్పందించి ఆ అవినీతి అధికారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

చంద్రగిరిలో ధర్మవరం వ్యాపారి ఆందోళన

రూ.50 లక్షల పట్టుచీరలు తీసుకుని మోసగించిన మహిళ

ఆమె ఇంటి వద్ద బైఠాయించిన బాధితుడు



మాట్లాడుతున్న సాయికుమార్

ధర్మవరం, సెప్టెంబరు 1: తిరుపతి జిల్లా చంద్రగిరికి చెందిన కందుకూరి గాయత్రి అనే మహిళ రూ.50 లక్షల పట్టు చీరలను కొనుగోలు చేసి మోసగించిందని శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం పట్టణానికి చెందిన చేనేత వ్యాపారి ముత్తురెడ్డి సాయికుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. నెలల తరబడి సొమ్ము చెల్లించకపోవడంతో తాను చంద్రగిరికి వచ్చానని, నాలుగు రోజులుగా ఆమె ఇంటి చుట్టూ తిరుగుతున్నా స్పందించడం లేదని వాపోయాడు. చంద్రగిరి నుంచి ఆంధ్రజ్యోతికి ఆయన ఆదివారం ఫోన్ చేశారు. రెండేళ్ల నుంచి ఆమె తన వద్ద పట్టుచీరలను కొనుగోలు చేస్తోందని, నమ్మకం కలిగి చీరలను అప్పుగా ఇచ్చానని తెలిపారు. ఆ తరువాత ఎన్నాళ్లయినా ఆమె రాకపోవడంతో అనుమానం వచ్చి చంద్రగిరికి వచ్చానని తెలిపారు. డబ్బులు ఇవ్వకుండా మొండికి వేయడంతో ఆమెపై తిరుపతి గ్రీవెన్స్‌లో పోలీసులకు ఫిర్యాదు చేశానని తెలిపారు. డబ్బుల కోసం గాయత్రి ఇంటి వద్ద ఆదివారం బైఠాయించానని, దీంతో ఆమె డయల్ 100కు ఫోన్ చేసి పోలీసుల ద్వారా అడ్డుకుంటోందని తెలిపారు. ఆమె ఇంటి వద్ద బైఠాయించవద్దని, ఏదైనా ఉంటే తన సొంత ప్రాంతంలో పోలీసులకు ఫిర్యాదు చేయాలని ఇక్కడి పోలీసులు అంటున్నారని వాపోయాడు. ధర్మవరంలో తనతో పాటు 15 మంది పట్టు చీరల వ్యాపారులను ఇదే తరహాలో మోసం చేసిందని, తమిళనాడులో వ్యాపారులకు రూ.20 కోట్లు ఎగవేసినట్లు అక్కడి పత్రికల్లో కథనాలు వచ్చాయని అన్నారు. తనకు న్యాయం చేయాలని ఆయన పోలీసులకు విన్నవించారు.

అంబేడ్కర్ వాదానికి అక్షరరూపం.. మద్దూరి సాహిత్యం

పుస్తకావిష్కరణలో వక్తలు

అనంతపురం కల్చరల్, సెప్టెంబరు 1: అంబేడ్కర్ వాదానికి అక్షరరూపం మద్దూరి నగేష్‌బాబు సాహిత్యమని విశ్లేషకుడు డాక్టర్ ఖాజా అన్నారు. జెన్నె వైష్ణవి సాహిత్య వేదిక ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఎన్జీఓ హోంలో 'మద్దూరి నగేష్‌బాబు సమగ్ర సాహిత్యం' పుస్తక ఆవిష్కరణ సభ జరిగింది. సభకు డాక్టర్ ఖాజాతోపాటు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత బండి నారాయణస్వామి, డాక్టర్ కోయి కోటేశ్వరావు, యోగి వేమన యూనివర్సిటీ ప్రొఫెసర్ ఎంఎం వినోదిని హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళిత సాహితీ ఉద్యమానికి బీజం వేసిన వారిలో మద్దూరి నగేష్‌బాబు మొదటివాడన్నారు. అన్ని రూపాలలో దళితులపై అణచివేత ఏళ్లకు ఏళ్లు కొనసాగిందని, మద్దూరు నగేష్‌బాబు వంటివారు అంబేడ్కర్ సాహిత్య ప్రభావంతో దళితుల్లో గొప్ప స్ఫూర్తి రగిలించారన్నారు. జెన్నె వైష్ణవి సాహిత్య వేదిక వ్యవస్థాపకుడు డాక్టర్ జెన్నె ఆనంద్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో సాహితీవేత్తలు డాక్టర్ అంకె శ్రీనివాస్, అప్పిరెడ్డి హరినాథరెడ్డి, కొత్తపల్లి సురేష్, కంబదూరి షేక్ నబిరసూల్, గోసల నారాయణస్వామి, కోటిగారి వన్నప్ప, మిద్దె మురళీకృష్ణ, మధురశ్రీ, టీవీ రెండి, చం.శాస్త్రి, తూముచర్ల రాజారాం పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సాహితీవేత్తలు

రేపు జాబ్‌మేళా

నార్పల, సెప్టెంబరు 1: ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయిమెంట్ ఎక్ఛేంజ్, సీడప్, డీఆర్‌డీఏ సంయుక్తంగా మంగళవారం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు నైపుణ్యాభివృద్ధి అధికారి ఆనంద్ రాజ్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జాబ్‌మేళాలో అమర్‌రాజా, టాటా విస్టాన్, డిక్సాన్, బర్గిన్‌ఫైప్ కంపెనీలు పాల్గొంటాయన్నారు. పదవ తరగతి, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ పాస్, ఫెయిల్ అయిన 18 నుంచి 35 సంవత్సరాల వయస్సు వారు హాజరుకావచ్చన్నారు. జాబ్‌మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు సెల్ 9010039901 నెంబర్‌కు సంప్రదించాలన్నారు.

'పొలం పిలుస్తోంది' వాయిదా

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 1: భారీ వర్షాల నేపథ్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని ప్రభుత్వం వాయిదా వేసినట్లు జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 10వతేదీ నుంచి పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మొదలు పెట్టాలని రాష్ట్ర ఉన్నతాధికారులు ఆదేశించారన్నారు. అప్పటి నుంచి ప్రతి మంగళ, బుధవారాల్లో అన్ని మండలాల్లో కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. వ్యవసాయ అధికారితోపాటు అనుబంధ శాఖల అధికారులు, శాస్త్రవేత్తలు బృందాలుగా ఏర్పడి కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు.

సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఆత్మహత్య



అశోక్ (ఫైల్)

ఉరవకొండ, సెప్టెంబరు 1: వజ్రకరూరు మండలంలోని కొనకొండ్ల గ్రామంలో ఆర్థిక ఇబ్బందులతో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అశోక్ (26) ఉరివేసుకుని ఆదివారం ఆత్మహత్య చేసుకున్నాడు. కృష్ణమూర్తి, లక్ష్మీదేవి దంపతుల కుమారుడు అశోక్. చెన్నైలోని ఓ కంపెనీలో ఉద్యోగం చేస్తూ నాలుగేళ్ల నుంచి తండ్రితోపాటు వ్యవసాయం చేస్తున్నాడు. గత ఏడాది మిర్చి పంటను సాగు చేశాడు. వ్యవసాయం, చెల్లెలి పెళ్లి కోసం రూ. 12 లక్షల దాకా అప్పు చేశాడు. రెండు నెలల నుంచి ఇంటి వద్ద ఉంటూ వేరే కంపెనీలో ఉద్యోగం కోసం ప్రయత్నాలు మొదలు పెట్టాడు. చేసిన అప్పులు తీర్చే మార్గం లేక తీవ్ర మనోవేదనకు గురై ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య పాల్పడ్డాడు. గమనించిన బంధువులు గుంతకల్లు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

ప్రాణాలు తీసిన రీల్స్

సెల్ఫీ తీసుకుంటూ నీట మునిగి యువకుడి మృతి



మహమ్మద్ కైఫ్(ఫైల్)

చిలమత్తూరు, సెప్టెంబరు 1: సోషల్ మీడియా రీల్స్ చేస్తూ ప్రమాదవశాత్తు నీటిలో మునిగి యువకుడు మృతిచెందినట్లు ఎస్ఐ మున్నీర్ అహమ్మద్ తెలిపారు. హిందూపురం పట్టణంలోని బాలాజీనగర్‌కి చెందిన రియాజ్‌వుల్లా కుమారుడు మహమ్మద్ కైఫ్ (22) కుటుంబ సభ్యులతో శనివారం దేమకేతేపల్లి సమీపంలోని శ్రీధర్‌గుట్టలోని క్వారీ వద్దకు వెళ్లాడు. మహమ్మద్ కైఫ్ అక్కడున్న నీటిమడుగు చూసి అందులో దిగి సెల్ఫీతో రీల్స్ చేయడానికి ప్రయత్నించాడు. ప్రమాదవశాత్తు నీటిమడుగులో పడిపోయాడు. ఈత రాకపోవడంతో బయటకు రాలేకపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు కాపాడే ప్రయత్నం చేశారు. వారికీ ఈత రాకపోవడంతో పోలీసులకు సమాచారం అందించారు. వారు వచ్చేసరికి అతడు పూర్తిగా నీటిలో మునిగిపోయాడు. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది తీవ్రంగా గాలించారు. అయినా అతడి మృతదేహం లభ్యంకాలేదు. చీకటిపడటంతో ఆదివారం ఉదయం మరోమారు వారు ప్రయత్నించి మృతదేహాన్ని నీటి నుంచి బయటకు తీసుకువచ్చారు. కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

శ్రీకృష్ణుడి ఊరేగింపు


శ్రీకృష్ణుడి విగ్రహాన్ని ఊరేగిస్తున్న భక్తులు

కొత్తచెరువు, సెప్టెంబరు 1: కృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా ప్రబోధ సేవాసమితి ఆధ్వర్యంలో ఆదివారం కొత్త చెరువులో శ్రీకృష్ణుడి విగ్రహాన్ని ఊరేగించారు. విగ్రహాన్ని పల్లకిలో ఉంచి భజనలు చేస్తూ, భక్తి పాటలు ఆలపిస్తూ ఊరేగింపు నిర్వహించారు. ప్రజలు కాయకర్పూరం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

వినాయక విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి: ఎస్ఐ

కదిరి, (అమడగూరు), సెప్టెంబరు 1: మండల వ్యాప్తంగా వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసేవారు అనుమతి తప్పకుండా తీసుకోవాలని ఎస్ఐ వెంకటనారాయణ పేర్కొన్నారు. ఆయన ఆదివారం మాట్లాడుతూ ఉత్సవ కమిటీ వారు ముందుగా పోలీసులు అనుమతులు తీసుకోవా లన్నారు. రోడ్డుకు అంతరాయం లేకుండా విగ్రహాలు ఏర్పాటు చేయాలన్నారు. విగ్రహాల వద్ద పెద్ద శబ్దాలు పెట్ట కూడదన్నారు. రాత్రిళ్లు కమిటీ సభ్యులు కాపలా ఉండా లన్నారు. నిమజ్జనం రూట్ మ్యాప్‌ను ముందే తెలిపాలని, నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

రేపు పాలిటెక్నిక్ కళాశాలలో జాబ్‌మేళా

ధర్మవరం, సెప్టెంబరు 1: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ ఆధ్వర్యంలో జిల్లాలోని నిరుద్యోగ యువతీయువకులకు ధర్మవరం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈనెల 3న జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ సురేశ్ బాబు, నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి అబ్దుల్ ఖాయ్యుం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ మేళాను ఆరు కంపెనీల కోసం నిర్వహిస్తున్నామన్నారు. కావున పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, పీజీ, డిప్లొమా పూర్తి చేసిన 18 నుంచి 35 సంవత్సరాలలోపుఉన్న వారు అర్హులన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన వారికి నెలకు రూ.12 వేల నుంచి రూ.20వేల వరకు జీతం ఉంటుందన్నారు. శ్రీసత్యసాయి, అనంతపురం జిల్లాలు, హైదరాబాద్, బెంగుళూర్ ప్రాంతాల్లో ఉద్యోగం చేయాల్సి ఉంటుందన్నారు. ఇంటర్వ్యూకు హాజరయ్యే అభ్యర్థులు తమ బయోడేటాతో పాటు ఆధార్‌కార్డు, విద్యార్హత ధ్రువీకరణ పత్రాలు తీసుకుని ఉదయం 9గంటలకు హాజరు కావాలన్నారు.

టీడీపీ నాయకుడికి పరామర్శ

నల్లమాడ, సెప్టెంబరు 1: మండల కేంద్రంలోని టీడీపీ సీనియర్ నాయకుడు ఖాదర్‌వలి అనారోగ్యంతో చికిత్సలు తీసుకుని స్వగ్రామానికి చేరుకున్నారు. ఈవిషయం తెలుసుకున్న టీడీపీ నాయకులు ఆదివారం ఆయన నివాసానికెళ్లి పరామర్శించారు. ఈకార్యక్రమంలో ఎస్ కేశవరెడ్డి, బుట్టి నాగభూషణనాయుడు, మహేంద్రనాయక్, బైపరెడ్డి, అనిల్‌కుమార్, రామచంద్ర, బేల్దారి రాజు, నరేంద్రరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

రొళ్ల, సెప్టెంబరు 1: పేకాట స్థావరాలపై దాడి చేసిన పోలీసులు పది మంది జూదరులను అరెస్ట్ చేశారు. ఎస్పీ ఆదేశాల మేరకు మడకశిర సీఐ ఆధ్వర్యంలో మండలంలోని రత్నగిరి గ్రామంలో గుట్టలవద పేకాట స్థావరాలపై ఎస్ఐ రాజశేఖర్ తమ సిబ్బందితో దాడి చేశారు. మొత్తం 38 మందిపై కేసు నమోదు చేయ గా అందులో 28 మంది పరారీలో ఉన్నారు. రూ.1,02,550 నగదు, 8 సెల్ ఫోన్లు, 7 మోటారు సైకిళ్లు స్వాధీనం చేసుకొన్నట్లు ఎస్ఐ తెలిపారు.

వైభవంగా అంజన్న రథోత్సవం


భారీ జన సందోహం మధ్య స్వామివారి రథోత్సవం

బొమ్మనహాళ్, సెప్టెంబరు 1: మండలంలోని నేమకల్లు గ్రామంలో వెలసిన ఆంజనేయస్వామి రథోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. ప్రతి ఏటా శ్రావణమాసంలో ఆదివారం ఉదయం ఉత్సవం, రథోత్సవం జరిపిస్తారు. వేకువజామున స్వామివారి ఉత్సవాన్ని భారీ జనసందోహం మధ్య నిర్వహించారు. సాయంత్రం 4 గంటలకు రథోత్సవాన్ని నిర్వహించా రు. ఈ కార్యక్రమానికి రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ముఖ్య అతిథిగా హాజరై స్వామివారికి పూజలు జరిపారు. అనంతరం రథాన్ని లాగారు.

సత్యమ్మ దేవతకు ప్రత్యేక పూజలు


పూజలు చేస్తున్న టీడీపీ నాయకులు

నల్లమాడ, సెప్టెంబరు 1: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు మొదటిసారిగా ముఖ్యమంత్రి పదవి చేపట్టి 30 యేళ్ల గడుస్తున్న సందర్భంగా మండలకేంద్రంలోని సత్యమ్మకు టీడీపీ స్థానిక నాయకులు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. చంద్రబాబు 1995లో ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారని, నేటికి 30యేళ్లు అవుతోందన్నారు. అనంతరం చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి, కేకట్ కట్ చేసి పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బుట్టి నాగభూషన్‌నాయుడు, గన్‌రెడ్డి, రషీద్ ఖాన్, అబ్బాస్‌ఖాన్, ఆటో బాషా, ఎస్. కేశవరెడ్డి, నరేంద్ర రెడ్డి, నరసింహులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓపీఎస్‌ను పునరుద్ధరించాలి

ఉపాధ్యాయ సంఘాల డిమాండ్



ధర్మవరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఏపీటీఎఫ్ నాయకుల నిరసన


కదిరి అంబేడ్కర్ సర్కిల్‌లో...

ధర్మవరం, సెప్టెంబరు 1: పాత పెన్షన్ విధానం తప్ప ఏ ఇతర ప్రత్యామ్నాయ విధానాలు తమకు అమోదయోగ్యం కాదని ఏపీటీఎఫ్ నాయకులు పేర్కొన్నారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆదివారం పెన్షన్ విద్రోహ చీకటి దినంగా అభివ ర్ణిస్తూ ధర్మవరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట స్థానిక నాయకులు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ నిరసన కార్యక్రమాన్ని ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు బలరాముడు, సానే రవీంద్రారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...పాత పెన్షన్ విధానం పునరుద్ధరించి, ఉద్యోగ, ఉపాధ్యాయుల 20సంవత్సరాల కోరికను వెంటనే అమలుచేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా జీఓ నంబర్ 117, జీఓ నంబర్ 84ను వెంటనే రద్దుచేయాలని డిమాండ్‌చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో ధర్మవరం పట్టణ, మండల బాధ్యులు ఈశ్వరయ్య, శివానంద, చెన్నే కొత్తపల్లి మండల బాధ్యులు బాలయ్య, రామగిరి మండల బాధ్యులు నరసింహులు, బత్తలపల్లి మండల బాధ్యులు గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

కదిరి అర్బన్: సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని ఎపీటీఎఫ్ 1938, ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో వేర్వేరుగా ఆందోళనలు చేపట్టారు. ఆర్అండ్ బంగ్లానుంచి ఆదివారం అంబేడ్కర్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులపై బలవంతంగా సీపీఎస్‌ను ప్రవేశపెట్టారని, వెంటనే దీన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు హరిప్రసాద్‌రెడ్డి, సురేంద్ర, నర్సిరెడ్డి, వెంకటేష్‌బాబు, సోమశేఖర్, రమణారెడ్డి, చింతా శ్రీనివాసులు, రామమోహన్, ఆదిబయ్యన్న తదితరులున్నారు.

ఓబుళదేవరచెరువు: ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం అమలు చేయాలని డీటీఎఫ్ (డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్) జిల్లా అధ్యక్షుడు గౌస్‌లాజం డిమాండ్ చేశారు. ఆయన ఆదివారం మండలకేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ... కేంద్రం యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్‌ను దేశ వ్యాప్తంగా అమలు చేయడాన్ని వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం సీపీఎస్, జీపీఎస్‌ను రద్దు చేసి, పాత పెన్షన్ విధానం కొనసాగించాలని కోరారు. ఆయనతో పాటు మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నరసింహులు, సోమశేఖర్‌నాయక్ తదితరులున్నారు.

మున్సిపల్ కమిషనర్.. మాకొద్దు

- గతంలో ఆయన అవినీతి, అక్రమాలపై విచారణ చేపట్టాలి: టీడీపీ నాయకులు


మాట్లాడుతున్న టీడీపీ ఎస్సీసెల్ జిల్లా ఉపాధ్యక్షుడు కేశగాళ్ల శ్రీనివాసులు

ధర్మవరం, సెప్టెంబరు 1: గతంలో అవినీతి అక్రమాలకు పాల్పడిన స్థానిక మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున తమకొద్దని టీడీపీ ఎస్సీసెల్ జిల్లా ఉపాధ్యక్షుడు కేశగాళ్ల శ్రీనివాసులు అన్నారు. గాంధీనగర్‌లోని టీడీపీ స్థానిక కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరుల సమావే శంలో మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ధర్మవరం మున్సిపల్ కమిషనర్‌గా పనిచేసిన మల్లికార్జున గతంలో టీడీపీ శ్రేణులకు పూర్తిగా వ్యతిరేకంగా, వైసీపీ నాయకులకు అనుకూలంగా వ్యవహరిస్తూ అనేక అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. అప్పట్లో మల్లేనిపల్లి వద్ద ఉన్న డంపింగ్ యార్డ్‌లో కూడా కోట్లాది రూపాయాలు స్వాహా అయినట్లు పట్టణంలో చర్చ జరుగుతోందన్నారు. అలాంటి వాటిపై విచారణ చేసి సంబంధిత అధికారిపై చర్యలు తీసుకోవాల్సింది పోయి, తిరిగి ఆయనను ధర్మవరం మున్సిపల్ కమిషనర్‌గా నియమించడంలో అంతర్యమేమిటో అర్థం కావడంలేదన్నారు. ఆయనను ఇక్కడే ఉంచితే, బదిలీపై వెళ్లేంత వరకు ఎస్సీసెల్ ఆధ్వర్యంలో ప్రతిరోజు ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ గజ్జల సుబ్రహ్మణ్యం, పట్టణ ప్రధానకార్యదర్శి మొండి శ్రీనివాసులు, మండల ప్రధానకార్యదర్శి ఎంజీ ఆదెప్ప, నాయకులు చిన్ననరసింహులు, విశ్వనాథ్, మురళి పాల్గొన్నారు.

మొక్కలతోనే కాలుష్య నియంత్రణ: సీఐ


సర్కిల్ కార్యాలయం వద్ద మొక్కలు నాటుతున్న పోలీసులు

ముదిగుబ్బ, సెప్టెంబరు 1: మొక్కలతోనే కాలుష్య నియంత్రణ సాధ్యమని రూరల్ సీఐ శ్యామ్ రావు పేర్కొన్నారు. స్థానిక సర్కిల్ కార్యాలయం వద్ద ఆదివారం ఆయన ఆధ్వర్యంలో మొక్కలు పెంచుదాం, పర్యావరణాన్ని కాపాడుదాం కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ప్రముఖ పర్యా వరణవేత్త డాక్టర్ భాస్కర్ నాయుడు, ఇంటర్నేషనల్ యోగా గురు రాఘవేంద్ర రాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా మొక్కలు నాటారు. అనంతరం రూరల్ సీఐ మాట్లాడుతూ జిల్లా ఎస్పీ రత్న ఆదేశాల మేరకు మొక్కలు నాటే కార్యాక్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్య క్రమంలో నేషనల్ హ్యూమన్ రైట్స్ కల్చర్ నేచర్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ స్టేట్ యూత్ ప్రెసిడెంట్ నితిన్ చౌదరి, పట్నం, తాడిమర్రి ఎస్ఐలు నరసింహులు, నాగస్వామి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ పరికరాల చోరీ

గార్లదిన్నె, సెప్టెంబరు 1: మండలంలోని గార్లదిన్నె, బూదేడు గ్రామాలలో ఉన్న వ్యవసాయ తోటల్లో విద్యుత్ పరికరాలు చోరీకి గురయ్యాయి. బూదేడు గ్రామానికి చెందిన రామాంజనేయులు, గార్లదిన్నెకు చెందిన రైతు నల్లప్ప వ్యవసాయ తోటల్లో బోర్లకు అమర్చిన విద్యుత్ స్టార్టర్ పెట్టెలను శనివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. ఆదివారం ఉదయం రైతులు తోటల వద్దకు వెళ్లిచూడగా పరికరాలు చోరీకి గురైనట్లు గుర్తించారు. బాధితులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దుండగుల కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు ఎస్ఐ గౌస్‌బాషా తెలిపారు.

చేనేత ప్రదర్శన ప్రారంభం


చేనేత ప్రదర్శనను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్

కదిరి, సెప్టెంబరు 1: పట్టణంలోని గీతామందిరంలో ఆదివారం ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ చేనేత, హస్తకళల ప్రదర్శనను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.... చేనేత, హస్తకళలకు ప్రోత్సాహం ఇవ్వాలని ప్రజలకు సూచించారు. చేనేత ద్వారా కార్మికులకు లబ్ధి చేకూరుతుం దని, హస్తకళలు సంప్రదాయాన్ని చాటి చెబుతాయన్నారు. అనంతరం స్టాల్స్‌ను పరిశీలించారు. ఈనెల 15వతేదీ వరకు చేనేత, హస్తకళల ప్రదర్శన ఉంటుందని నిర్వాహకులు శ్రీకళాజ్యోతి హెడ్ క్రాఫ్ట వెల్ఫేర్ సొసైటీ వారు తెలిపారు.

ప్రజా పంపిణీ వ్యవస్థను పటిష్టం చేయాలి

- సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్యయాదవ్

కదిరి అర్బన్, సెప్టెంబరు 1: ప్రజాపంపిణీ వ్యవస్థను పటిష్టం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్యయాదవ్ పేర్కొన్నారు. ఆయన ఆదివారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రోజురోజుకు పెరుగుతున్న నిత్యావసర ధరలను తగ్గించాలని కోరారు. అర్హులైన వారందరికి రేషన్‌కార్డులు ఇవ్వాలన్నారు. గతంలో లాగా సబ్సిడీ రూపంలో ఏడు రకాల సరుకులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలంటూ సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం నుంచి ఈ నెల ఆరో తేదీ వరకు దేశవ్యాప్తం ఆందోళనకు సీపీఐ పిలుపునిచ్చిందని ఆయన తెలిపారు.

రైలు నుంచి జారిపడి ప్రయాణికుడి మృతి


అజిత్‌సింగ్(ఫైల్)

ధర్మవరంరూరల్, సెప్టెంబరు1: మండలంలోని చిగిచెర్ల-జంగాలపల్లి రైల్వేస్టేషన్‌ల మధ్య ఆదివారం రైలునుంచి జారిపడి ఓ ప్రయాణికుడు మృతి చెందినట్లు జీఆర్‌పీ పోలీసులు తెలిపారు. మహారాష్ట్రలోని పుణేకు చెందిన అజిత్‌సింగ్(40) ఉద్యాన్ ఎక్స్‌ప్రెస్‌లో పుణే నుంచి బెంగళూరుకు వెళుతున్నాడు. అయితే జంగాలపల్లి నుంచి చిగిచెర్ల మధ్యలో వెళుతున్న రైలులో నుంచి పొరపాటున జారిపడి మృతిచెందాడని పోలీసులు తెలిపారు. మృతుడు బెంగళూరు ఎయిర్‌పోర్టులో టెక్నాలజీ విభాగంలో విధులు నిర్వర్తిస్తున్నాడు. కీమెన్ ఇచ్చిన సమాచారం మేరకు జీఆర్‌పీ పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి మృతుడి వద్ద ఉన్న ఆధారాలతో బంధువులకు, సిబ్బందికి సమాచారం అందించారు. కేసునమోదు చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు జీఆర్‌పీ పోలీసులు తెలిపారు.

దారి దోపిడీ దొంగల అరెస్ట్

హిందూపురం, సెప్టెంబరు 1 : పట్టణానికి సమీపంలోని పారిశ్రామికవాడలో ఒంటరిగా వెళ్తున్నవారిని టార్గెట్‌చేసి దారిదోపిడి చేస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ మహేష్, సీఐ ఆంజనేయులు తెలిపారు. ఆదివారం అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్లో విలేకరుల సమావేశంలో ఇలా వివరించారు. పట్టణంలోని కోట ప్రాంతానికి చెందిన షేక్ అబూబకర్ సిద్దిక్, మహ్మద్ ముజాహిద్ కొంతకాలంగా పారిశ్రామికవాడలో పట్టపగలే ఒంటరిగా వెళ్తున్న వారిపై దాడిచేసి నగదు, సెల్‌ఫోన్‌లు ఎత్తుకెళ్తున్నారు. వారం క్రితం పారిశ్రామికవాడ సమీపంలో ఒంటరిగా వెళ్తున్న ఓ వ్యక్తిని గాయపరిచి అతని వద్ద నుంచి నగదు, సెల్‌ఫోన్ ఎత్తుకెళ్లారు. బాధితుడు అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేపట్టిన సీఐ ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి వారి నుంచి సెల్‌ఫోన్‌లు, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఎవరికైనా ఇలాంటి సంఘటనలు జరిగితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

రెండు వర్గాల మధ్య ఘర్షణ

బత్తలపల్లి, సెప్టెంబరు 1: మండలపరిధిలోని తంబాపురం గ్రామంలో ఆదివారం ఇరు వర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. తంబాపురం గ్రామానికి చెందిన సూర్యనారాయణ కుమార్తె సంధ్య, ధర్మవరం మండలం బడన్నపల్లికి చెందిన ఓబులేసు కుమారుడు ఆకాష్ రెండు నెలల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. శనివారం ఆకాష్ అమ్మ సునీతమ్మ తన అన్న అయిన పోతలయ్యకు రాఖీ కట్టేందుకు వచ్చింది. ఆదివారం ఉదయం ఒకరికొకరు ఎదురు పడి వాగ్వాదానికి దిగి దాడిచేసుకున్నారు. ఓబులేసు వర్గానికి చెందిన పెద్దవీరప్ప, చిన్నవీరప్ప, ఓబులేసు, నాగరత్నమ్మ, పెద్దక్కలకు, సూర్యనారాయణ వర్గానికి చెందిన సూర్యనారాయణ, లక్ష్మీ, శివశంకర్, ఆకాష్‌లకు గాయాలయ్యాయి. వీరిని


ఘర్షణలో గాయపడిన చిన్నవీరప్ప, పెద్దవీరప్ప, ఓబుళేశు

ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. ఓబులేసు, సూర్యనారాయణ ఫిర్యాదుల మేరకు ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లులఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.

బత్తలపల్లిలో చిత్తడే చిత్తడి


బత్తలపల్లి ప్రధాన రహదారిలో నిలిచిన నీరు

బత్తలపల్లి, సెప్టెంబరు 1: ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో మండలకేంద్రంలో ఎక్కడ చూసినా చిత్తడి చిత్తడిగా మారింది. ప్రధాన రహదారులైన ధర్మవరంరోడ్డు, తాడిపత్రిరోడ్డుతో పాటు వీధులన్నీ నీరు నిలిచి బరదమయంగా మారాయి. నీరు నిలిచినచోట దుర్వాసన వెద జల్లుతోంది. ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నీరు నిల్వ ఉండడం వల్ల దోమలు వ్యాప్తి చెంది ప్రజలు రోగాల బారిన పడే అవకాశం ఉందని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో అక్కడక్కడ డయేరియా, విష జ్వరాలు ఉందని, ఈ పరిస్థితి ఇలానే కొనసాగితే విషజ్వరాలు ప్రబలే అవకాశం ఉందని ప్రజలు వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, బ్లీచింగ్, ఫాగింగ్ వంటివి చేయాలని కోరారు.

ఇలా ఉంటే నీరు కలుషితం కాదా?

ఓబుళదేవరచెరువు: ఒక పక్క ప్రభుత్వ మంచినీటి పథకం, మరో పక్క సత్యసాయి నీటి ట్యాంక్ ఉన్నాయి. వాటి చెంతనే మురుగునీరు నిలువ ఉంది. దీంతో నీరు కలుషితమై పోతుందని మండలంలోని మామిళ్లకుంట్లపల్లి గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పరిస్థితిని పలుమార్లు అధికారులకు విన్నవించినా ఫలితం లేదంటున్నారు. నీరు కలుషితమై అతిసారం, ప్రబలకుండానే ఉన్నతాధికారులు స్పందించి తక్షణ చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.


నీటి ట్యాంక్ వద్ద నిల్వ ఉన్న మురుగు

అలరించిన భక్తిగీతాలాపన


పాటలు పాడుతున్న విద్యార్థులు

పుట్టపర్తి, సెప్టెంబరు 1: సత్యసాయి విద్యార్థులు భక్తిగీతాలాపన భక్తులను అలరింపజేసింది. శ్రీసత్యసాయి మీడియా సెంటర్ 23వ వార్షికోత్సవాన్ని ఆదివారం ప్రశాంతినిలయంలో ఘనంగా నిర్వహించారు. మొదట విద్యార్థుల వేద పఠనంతో వేడుకలు ప్రారంభమయ్యాయి. మీడియాసెంటర్ డైరక్టర్ సుందర స్వామి నాథన్ మాట్లాడుతూ... మీడియాసెంటర్ ద్వారా నిర్వహించిన ఆధ్యాత్మిక ప్రసారాల గురించి వివరించారు. రెండుదశాబ్దాలకు పైగా ప్రశాంతినిలయంలో జరిగే కార్యక్రమాలను ప్రపంచవ్యాప్తంగా ఉన్న సత్యసాయి భక్తులకు చేరవేస్తున్నామని తెలిపారు. అనంతరం విద్యార్థులు సంగీత గానకచేరితో అలరించారు. భక్తులు సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.

వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

తహసీల్దార్, ఎంపీడీఓ సూచన

నల్లమాడ, సెప్టెంబరు 1: మండలంలో భారీ వర్షాలు కురుస్తున్నందన ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ రంగనాయకులు పేర్కొన్నారు. ఆయన ఆదివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మం డలాధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ... తుఫాన్‌పై అవగాహన కల్పించారు. ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. సచివాలయ సిబ్బంది గ్రామస్థాయిలో సమన్వయ సమావేశం ఏర్పాటు చేసి, ప్రస్తుత పరిస్థితులో తీసుకోవాల్సిన చర్యలపై చర్చించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఎండీపీఓ కార్యాలయం ఏఓ రామచంద్రారెడ్డి, ఏఎస్ఐ సురేంద్ర, ఇరిగేషన్ అధికారి అనీలా, గ్రామీణ నీటి సరఫరా అధికారి శశికళ, పంచాయతీరాజ్ జేఈ గురురాజుగుప్త, రెవెన్యూ శాఖ సిబ్బంది ఉన్నారు.

తనకల్లు: ప్రస్తుతం తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు వర్షపు నీరు ఇళ్లలోకి వెళ్లకుండా, రోడ్లపై నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ వెంకటరమణ అధికారులకు సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆదివారం వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఆట్లాడుతూ... వర్షం వలన ప్రజలకు ఎక్కడా ఇబ్బందులు కలకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శులు ఆయా గ్రామాల్లో పర్యటించి వర్షపు నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకో వాలన్నారు. నీటి నిల్వ వలన దోమలు పెరిగే అవకాశముందన్నారు. ఆరోగ్య శాఖ, పంచాయ తీ అధికారులతో కలిసి చేపట్టాల్సిన కార్యక్రమాలపై వివరించారు. ఏమైనా సమస్యలుంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. పంటలు దెబ్బతింటే వ్యవసాయ, రెవెన్యూ శాఖలు సంయుక్తగా జరిగిన నష్టాన్ని అంచనా వేయాలని సూచించారు.

11వ రోజుకు చేరిన కార్మికుల సమ్మె


సత్యసాయి పంప్‌హౌస్ వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

ధర్మవరం, సెప్టెంబరు 1: ఆర్నెల్లుగా పెండింగ్‌లో ఉన్న తమ వేతనాలను వెంటనే ఇవ్వాలని సత్యసాయి నీటి సరఫరా కార్మికులు చేపట్టిన ధర్నా ఆదివారం 11వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... వేతనాలు అందక చాలా ఇబ్బందులు పడుతున్నామని అన్నారు. గ్రామాల్లో పైపులైన్‌ల మరమ్మతులకు కూడా సొంత డబ్బులు పెడుతున్నామన్నారు. అందుకు కూడా తమ వద్ద డబ్బులు లేకపోవడంతో నిరసనకు దిగాల్సి వచ్చిందని ఆవేదన చెందారు.

నేడు మొక్కలు నాటే కార్యక్రమం

- జనసేన నాయకులు

కదిరి అర్బన్, సెప్టెంబరు 1: ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ జన్మదినం సందర్భంగా సోమవారం పట్టణంలోని ఆర్అండ్‌బీ బంగ్లా ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి భైరవప్రసాద్ పేర్కొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, పవన్ అభిమానులు పెద్దఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఆయన ఆదివారం పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... సోమవారం ఉదయం 8.30కు మాధవ గురుకులంలో కేక్ కట్ చేసి, అక్కడే మొక్కలు నాటుతామన్నారు. అనంతరం జీవిమాను సర్కిల్‌లో అల్పాహారం, 10.30కు ఆర్అండ్‌బీ బంగ్లా ఆవరణంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు.

రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయండి

కదిరి అర్బన్ : ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ జన్మది నం సందర్భంగా సోమవారం స్థానిక ఎన్జీఓ హోమ్‌లో నిర్వహించే రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని కామన్‌మ్యాన్ ప్రొటెక్షన్ కోర్సు నాయకులు పేర్కొన్నారు. వారు ఆదివారం ఎన్జీఓ హోమ్‌లో విలేకరులతో మాట్లాడుతూ.. ఉదయం 8గంటల నుంచి రక్తదాతలు రక్తదానం చేయాలని కోరారు. కార్యక్రమంలో సభ్యులు కిన్నెర మహేష్, మల్లెం మోహన్, ఈటి లోకేశ్వర్, అనూరాధ, బాలాజీ. హరిప్రసాద్, సురేష్ తదితరులున్నారు.

ఉత్సాహంగా క్రికెట్ పోటీలు

కదిరి అర్బన్, సెప్టెంబరు 1: పట్టణంలోని ఎస్‌టీఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో ఆదివారం నిర్వహించిన క్రికెట్ పోటీలు ఉత్సాహంగా సాగాయి. టీ 20 పోటీల్లో ఎల్ఐటీ జట్టుపై ఆర్డీటీ కోచింగ్‌క్యాంప్ జట్టు ఆరు పరుగుల తేడాతో విజయం సాధించినట్లు కోచ్ నజీర్ తెలిపారు. మొదట బ్యాటింగ్ చేసిన క్యాంప్ జట్టు 20 ఓవర్లలో 120 పరుగులు చేసింది. జట్టులోని సాయిప్రణీత్ 60, సాకిబ్ 55, మిశ్వేయ్ 25 పరుగులతో రాణించారు. తరువాత బ్యాటింగ్ ప్రారంభించిన ఎల్ఐటీ జట్టు 174 పరుగులకు ఆల్ అవుట్ అయిందని నజీర్ తెలిపారు. విజయం సాధించిన జట్టును సీనియర్ క్రీడకారులు షామిర్, కరుణ, మహి తదితరులు అభినందించారు.

కారు అపహరణ కేసులో ఇద్దరి అరెస్టు: సీఐ


నిందితుల అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న సీఐ యతీంద్ర

ముదిగుబ్బ, సెప్టెంబరు 1: కారును అపహరించిన కేసులో ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు ముదిగుబ్బ సీఐ యతీంద్ర తెలిపారు. ఆయన ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద విలేకరుల సమావేశంలో నిందితుల అరెస్టు వివరాలు ఇలా వెల్లడించారు. మండల కేంద్రంలోని పాత పోస్టాఫీస్ వీధిలో గుర్తు తెలియని వ్యక్తులు ఆగస్టు 24వ తేదీ రాత్రి వేల్పుల విజయసింహ తనకు చెందిన ఏపీ39- ఎమ్ఎఫ్-6263 నెంబరు గల మారుతీ ఎర్టిగా వీఎక్స్ఐ కారును తన ఇంటి ఎదుట పార్కింగ్ చేశాడు. రాత్రిపూట గుర్తు తెలియని వ్యక్తులు దానిని అపహరించారని, కారు యజమాని విజయసింహ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేపట్టారు. జిల్లా ఎస్పీ రత్న, ధర్మవరం డీఎస్పీ శ్రీనివాసులు ఆదేశాల మేరకు, ముదిగుబ్బ అప్‌గ్రేడ్ పోలీస్‌స్టేషన్ సీఐ యతీంద్ర దర్యాప్తులో భాగంగా నేర స్థలాన్ని పరిశీలించారు. అనుమానితుల కదలికలపై నిఘా ఉంచారు. సీఐకి శనివారం సాయంత్రం వచ్చిన సమాచారం మేరకు, ముదిగుబ్బ శివారు లోని దొరిగల్లు రోడ్డు పై ఓవర్ సర్కిల్ వద్ద దొంగిలించిన కారుతో పాటు మండల కేంద్రానికి చెందిన షేక్ బాబ్జాన్, కొలిమి సురేష్‌ను అరెస్ట్ చేసి విచారించారు. ఆ కారును బెంగళూరుకు తీసుకెళ్లి ఎవరికైనా అమ్మి డబ్బు సంపాదించాలని దొంగలించినట్లు వారు నేరం ఒప్పుకున్నట్లు సీఐ తెలిపారు. నిందితులు ఇద్దరినీ ఆదివారం రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వెల్లడించారు. త్వరగా ఈ కేసును చేదించడంపట్ల జిల్లా ఎస్పీ, సీఐని సిబ్బందిని అభినందించినట్లు తెలిపారు.



హిందూపురంలో అన్నదానం చేస్తున్న టీడీపీ నాయకులు

తండ్రికి తగ్గ తనయుడు బాలకృష్ణ

● 50 ఏళ్ల సినీ ప్రస్థానంపై అభిమానుల సంబరాలు

హిందూపురం, సెప్టెంబరు 1: సినీరంగంలో నందమూరి తారకరామారావుకు తగ్గ తనయుడు నందమూరి బాలకృష్ణ అని టీడీపీ నాయకులు ప్రశంసించారు. ఆయన సినీరంగప్రవేశం చేసి 50ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఆదివారం హిందూపురం పట్టణంలో టీడీపీ ఆధ్వర్యంలో స్వర్ణోత్సవ సంబరాలు జరుపుకున్నారు. చిన్నమార్కెట్‌వద్ద పేదలకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా టీడీపీ పట్టణాధ్యక్షుడు రమేష్, మున్సిపల్ మాజీ చైర్మన్ జేపీకే రాము మాట్లాడుతూ- బాలకృష్ణ బాలనటుడి నుంచి నేటి వరకు అనేక విభిన్న పాత్రలు చేసి ప్రేక్షకులకు వినోదాన్ని పెంచారన్నారు. జానపద, పౌరాణిక, సాంఘిక, రాజకీయపరంమైన చిత్రాల్లో నటించి ఆయనకు ఆయనే సాటిగా నిలిచారన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ నాగేంద్రమ్మ, మాజీ కౌన్సిలర్ హిదయతుల్లా, మూర్తి, ఆటో సంజీవన, టైలర్ గంగాదర్, లక్ష్మీనారాయణ, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

గోరంట్ల: మండలంలోని ఎర్రయ్యగారిపల్లికి చెందిన టీడీపీ నాయకుడు పచ్చ అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో గోరంట్లలో అన్నదానం చేపట్టారు. ఈకార్యక్రమంలో నాయకులు హరిచౌదరి, సోముశేఖర్, రాజారెడ్డి, పుట్టపర్తి లక్ష్మణ, గిరిధర్‌గౌడ్, అజంతుల్లా, ప్రకాష్, శేఖర్, రవినాయక్, బిజేపీ రమా పావనిరాయల్, జనసేన కావేరి తదితరులు పాల్గొన్నారు.

చిలమత్తూరు: ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ సినీరంగ ప్రవేశం చేసి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఆయనకు అభిమానులు ఘనంగా అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద ఎన్‌బీకే ఫ్యాన్స్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత పార్లమెంట్ కార్యదర్శి నాగేంద్ర, విశ్వనాథరెడ్డి, శ్రీనివాసులు, నాగరాజ్‌యాదవ్, రఫి, పవన్, హరీష్, నరేష్, ఆదినారాయణ, రహంతుల్లా, రాజు, కృష్ణమూర్తి, మంజునాథ్ తదితరలు పాల్గొన్నారు.

పైపులైన్ లీకేజీని పట్టించుకోని అధికారులు



పైపు పగిలి లీక్ అవుతున్న నీరు

మడకశిర రూరల్, సెప్టెంబరు 1: మండలంలోని జిల్లేడగుంట గ్రామంలో బోరు వద్ద తాగునీరు లీక్ అవుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదని గ్రామస్థులు వాపోతున్నారు. గ్రామానికి ఈ బోరు నుంచే తాగునీరు సరఫరా చేస్తారు. పైప్‌ లైన్ పగిలిపోవడంతో రహదారి బురదమయంగా మారింది. కలుషితమైన నీరు బోరులోకి చేరి కొళాయిల్లో కలుషిత నీరు సరఫరా అవుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పసిద్ధిచెందిన జిల్లేడగుంట ఆంజనేయస్వామి ఆలయానికి నిత్యం అనేక మంది భక్తులు కూడా వస్తుంటారు. విధిలేని పరిస్థితులో వచ్చే భక్తులు ఆ నీటినే తాగుతున్నారు. ఇలాంటి నీరు తాగడంతో గ్రామంలో ఇప్పటికే చాలా మందికి జ్వరాలు సోకుతున్నట్లు గ్రామస్థులు వాపోతున్నారు. ఇప్పటికై అధికారులు తాగునీటి బోరు వద్దనీరు లీక్ కాకుండ మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

దండోరా నాయకుడికి నివాళి

రొళ్ల, సెప్టెంబరు 1: దండోరా మండల అధ్యక్షుడు రంగసపల్లి రాయుడు ఆదివారం మృతి చెందారు. విషయం తెలుసుకొన్న ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు విశ్వనాథ్, ఎంఆర్‌పీఎస్ నాయకులు మృతదేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈసందర్భంగా దండోరా నాయకులు మాట్లాడుతూ రాయుడు పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని, వారి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి ఓదార్చారు. ఈసందర్భంగా దండోరా నాయకులు మధు, సాకే అమర్‌నాథ్, వై.రంగనాథ్, నిసార్‌అహ్మద్ మహాజన్, రేకులకుంట రామాంజి, జిల్లాగౌరవాధ్యక్షులు నరసింహులు, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

రహదారులు బురదమయం





మంగాపురంలో బురదమయంగా రోడ్డు, నారాయణమ్మ కాలనీలో..

పెనుకొండ రూరల్, సెప్టెంబరు 1: నగర పంచాయతీలో రోడ్లు అధ్వానంగా మారాయి. ఇటీవల కురుస్తున్న వర్షాలకు రహదారులు బురదమయంగా మారడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. పెనుకొండ, కోనాపురం, మంగాపురంకు వెళ్లే రోడ్లు ఇటీవల కురుస్తున్న వర్షాలకు గోతుల మయంగా మారాయి. అధ్వాన రోడ్డులో ప్రయాణించాలంటే నానా అవస్థలు పడుతున్నామని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తరచూ ప్రమాదాల భారిన పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు, పాలకులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.



రోడ్డు మధ్యలో ఏర్పడిన గొయ్యి

పెనుకొండ : పట్టణంలోని పసరవక్కురి బావి సమీపంలో రోడ్డు మధ్యలో గొయ్యి ఏర్పడి వాహనదారులకు ప్రమాదకరంగా మారింది. వర్షాలు వస్తే ఈ గొయ్యి నిండా నీరు నిండి రోడ్డు కనబడక పాదచారులు, వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. రాత్రివేళ కరెంటు పోతే పాదచారుల, వాహనదారుల ఇబ్బందులు వర్ణనాతీతం. అధికారులు చర్యలు తీసుకుని గొయ్యిని పూడ్చి ప్రజల ఇబ్బందులు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.



కాళీ ఆశ్రమంలో అమ్మకానికి ఉంచిన మట్టి వినాయకులు

మట్టి గణపతిని పూజిద్దాం..

పెనుకొండ, సెప్టెంబరు 1: వినాయక పండగను పురస్కరించుకుని మట్టి వినాయకుడిని పూజించాలని పర్యావరణ ప్రేమికులు పిలుపునిస్తున్న సంగతి తెలిసిందే. పట్టణంలో ఈ ఏడాది మట్టి విగ్రహాలు విరివిగా అమ్మకానికి ఉంచారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలు కాకుండా మట్టి విగ్రహాలపై పలువురు ఆసక్తి చూపుతున్నారు. గత యేడాదితో పోల్చితే ఈ యేడాది 20నుంచి 25శాతం, ధరలు తగ్గించి విక్రయిస్తున్నట్లు వ్యాపారులు పేర్కొన్నారు.

ప్రతిభా పురస్కారాలతో విద్యార్థుల్లో పోటీతత్వం: ఎమ్మెల్యే



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

మడకశిరటౌన్, సెప్టెంబరు 1 : ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందించడం విద్యార్థుల్లో పోటీతత్వం పెంచేందుకు దోహదం పడుతుందని, ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు పేర్కొన్నారు. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి, ఆదివారం పట్టణంలోని యాదవ కల్యాణ మండపం ఆవరణంలో జరిగిన శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల పంపిణీ చేశారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ సీడబ్ల్యూసీ సభ్యులు రఘువీరారెడ్డి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ యాదవులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే విద్యతోనే సాధ్యపడుతుందన్నారు. విద్య వల్ల జ్ఞానం పెరగడంతోపాటు పోటీ ప్రపంచంలో అందరితో సమానంగా ఎదిగేందుకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. తెలుగుదేశం పార్టీ ఎప్పుడూ యాదవులను రాజకీయంగా ఎదిగేందుకు ప్రోత్సహిస్తుందని, ప్రస్తుత రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస్ రాష్ట్రంలోనే అత్యధిక మెజార్టీతో గెలిచి రాష్ట్రం టీడీపీ అధ్యక్షుడిగా ఎంపికయ్యారన్నారు. అదేవిధంగా ధర్మవరం ఎమ్మెల్యే సత్యకుమార్‌యాదవ్ ఎన్‌డీఏ కూటమిలో మంత్రిగా ఎంతో కీలకపదవిలో ఉన్నారన్నారు. ఈకార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి, కార్యనిర్వాహక కార్యదర్శి రాధాకృష్ణ, రిటైర్డ్ ఐఎఫ్ఎస్ అధికారి చిక్కప్పయ్య, యాదవ ఎడ్యుకేషన్ చైర్మన్ బి.శివలింగప్ప పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి: ఏపీటీఎఫ్

హిందూపురం అర్బన్, సెప్టెంబరు1: ఉద్యోగుల పాలిట చీకటి దినంగా సెప్టెంబర్ 1 నిలిచిపోనుందని ఏపీటీఎఫ్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ప్లకార్డులు పట్టుకొని నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాత పెన్షన్ విధానాన్ని కొనసాగిస్తేనే ఉద్యోగులకు న్యాయం జరుగుతుందని, 20 సంవత్సరాలుగా ఉద్యోగులు పెన్షన్‌పై పోరాటం చేస్తున్నా ప్రభుత్వాలు పట్టించుకోలేదని ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి అంజన్‌మూర్తి, విమర్శించారు. సీనియర్ నాయకుడు గురురాజారావు మాట్లాడుతూ కార్పొరేట్ శక్తులకు పెత్తందార్లు తలొగ్గి ఉద్యోగ, ఉపాధ్యా కార్మికులపట్ల సీపీఎస్, జీపీఎస్ యూపీఎస్ అంటూ కాలయాపన చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పాత పెన్షన్ విధానంనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఉపాధ్యాయుడు విశ్వేశ్వరయ్య, లేపాక్షి, హిందూపురం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పణిభూషన్, నాగరాజు, రాజేశ్వరీ, నారాయణస్వామి, ఆదినారాయణ, రవికుమార్, రవీంద్ర, ఆంజనేయులు, ఉమామహేష్, షఫీవుల్లా, శంకర్ నాయక్, నరసింహమూర్తి, ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


గోరంట్ల : ప్రభుత్వం అమలు చేస్తున్న ఏకీకృత పెన్షన్ విధానాన్ని వ్యతిరేకిస్తూ గోరంట్లలో ఏపీటీఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో ఆదివారం ఉపాధ్యాయులు నిరసన చేపట్టారు. ఏపీటిఎఫ్ జిల్లా, మండల శాఖ నాయకులు, ఉపాధ్యాయులు పట్టణ బస్టాండ్ కూడలిలో నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. ఏపీటీఎఫ్ నాయకులు సుధాకర్‌రెడ్డి, సిరాజుద్దన్, వెంకటనారాయణరెడ్డి, సుధాకర్, రమణ, బాలక్రిష్ణ, చంద్రమౌళి, దామోదర్‌రెడ్డి, నగేష్, భాస్కర్‌రెడ్డి, వెంకటేష్, లక్ష్మీపతి, నరసింహులు, నంజప్ప, వెంకటరమణనాయక్, మోహన్‌బాబు, రామచంద్ర పాల్గొన్నారు.



గోరంట్లలో నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

నేడు నిడిగల్ ఉత్సవాలు





కనువిందు చేస్తున్న రామతీర్థం, ఆకట్టుకుంటున్న ఆలయాలు

పావగడ, సెప్టెంబరు 1 : కర్నాటక రాష్ట్రంలో రెండవ హంపిగా పేరుగాంచిన నిడిగల్ ఉత్సవాలకు అంతా సిద్ధమయ్యింది. ఇక్కడున్న పురాతన ఆలయాలు, రాజగోపురాలు, యుద్ధ ఫిరంగిలు పర్యాటకులను ఎంతగానో ఆకర్షిస్తుంటాయి. 20వేల అడుగులు ఉన్న రాజగోపురం నుంచి దుర్గాన్ని చూస్తే అద్భుత దృశ్యం ఆవిష్కరిస్తుంది.

నేడు నిడిగల్ ఉత్సవాలు

ఏటా శ్రావణమాసం చివరి సోమవారం నిడిగల్ ఉత్సవాలు జరుపుకోవాడం ఆనవాయితీ. శ్రీరాముడు నీటి కోసం రామబాణం వేసి గంగను పైకి తెప్పించడంతో రామతీర్థంగా పిలువబడిన కోనేటిలో నీరు సేవిస్తే ఎంతో పుణ్యం కలుగుతుందని భక్తుల అపార నమ్మకం. ఉత్సవాలకు ఎంపీ గోవింద కారజోల, ఎమ్మెల్యే వెంకటేశ్ హాజరు కానున్నారు.

హెంజేరు స్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో సిద్దేశ్వరస్వామి

మడకశిర(అమరాపురం), సెప్టెంబరు 1: మండలంలోని హేమావతి గ్రామంలో వెలిసిన హెంజేరు సిద్దేశ్వరస్వామికి ఆదివారం విశేషమైన పూజలు చేశారు. శ్రావణ మాసం చివరి ఆదివారం కావడంతో భక్తులతో ప్రాంగణం అంతా కిటకిటలాడింది. ఉదయం స్వామికి కుంకుమార్చన, తైలాభిషేకం, రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం నిర్వహించారు. స్వామివారిని పూలతో అలంకరించి వెండి కవచములు ధరించి ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ, ప్రాంతాల నుంచి భక్తులు విచ్చేశారు. శివనామస్మరణతో ఆలయం మార్మోగింది. భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు సిద్దలింగేశ్వరస్వామి, శివకుమార్‌స్వామి, గౌతమ్, ప్రదీప్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి కార్మికుల సమస్యను పరిష్కరించండి : సీఐటీయూ



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

పెనుకొండ, సెప్టెంబరు 1 : పది రోజులుగా సమ్మె చేస్తున్న సత్యసాయి వాటర్ వర్కర్స్ సమస్యలు వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రమేష్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ సత్యసాయి వాటర్ వర్కర్స్ సమస్యలుపరిష్కరించాలని అనేకరూపాల్లో నిరసన చేస్తున్నా ప్రభుత్వంకానీ అధికారులుకానీ పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేస్తుందన్నారు. కార్మికులకు రావాల్సిన ఆరునెలల జీతాలు చెల్లించకపోవడం దారుణమన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ చెల్లించడం లేదన్నారు. ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకుని సమస్య పరిష్కరించాలని కోరారు. మండల కన్వీనర్ బాబావలి, మహబూబ్‌బాష, నాగప్ప, రెడ్డప్పరెడ్డి, మురళి పాల్గొన్నారు.

కారు అపహరణ కేసులో ఇద్దరి అరెస్టు : సీఐ

ముదిగుబ్బ, సెప్టెంబరు 1: కారును అపహరించిన కేసులో ఇద్దరిని అరెస్ట్ చే సినట్లు ముదిగుబ్బ సీఐ యతీంద్ర తెలిపారు. ఆయన ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద విలేకరుల సమావేశంలో నిందితుల అరెస్టు వివారాలు ఇలా వెల్లడిం చారు. మండల కేంద్రంలోని పాత పోస్టాఫీస్ వీధిలో గుర్తు తెలియని వ్యక్తులు ఆగస్టు 24వ తేదీ రాత్రి వేల్పుల విజయసింహ తనకు చెందిన ఏపీ39- ఎమ్‌ఎఫ్- 6263 నెంబరు గల మారుతీ ఎర్టిగా వీఎక్స్ఐ కారును తన ఇంటి ఎదుట పా ర్కింగ్ చేశాడు. రాత్రిపూట గుర్తు తెలియని వ్యక్తులు దానిని అపహరించారని, కారు యజమాని విజయసింహ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చే పట్టారు. జిల్లా ఎస్పీ రత్న, ధర్మవరం డీఎస్పీ శ్రీనివాసులు ఆదేశాల మేరకు, ముదిగుబ్బ అప్‌గ్రేడ్ పోలీస్‌స్టేషన్ సీఐ యతీంద్ర దర్యాప్తులో భాగంగా నేర స్థలా న్ని పరిశీలించారు. అనుమానితుల కదలికలపై నిఘా ఉంచారు. సీఐకి శనివారం సాయంత్రం వచ్చిన సమాచారం మేరకు, ముదిగుబ్బ శివారు లోని దొరిగల్లు రోడ్డు పై ఓవర్ సర్కిల్ వద్ద దొంగిలించిన కారుతో పాటు మండల కేంద్రానికి చెందిన షేక్ బాబ్జాన్, కొలిమి సురేష్‌ను అరెస్ట్ చేసి విచారించారు. ఆ కారును బెంగళూరుకు తీసుకెళ్లి ఎవరికైనా అమ్మి డబ్బు సంపాదించాలని దొంగలించినట్లు వారు నేరం ఒప్పుకున్నట్లు సీఐ తెలిపారు. నిందితులు ఇద్దరినీ ఆదివారం రిమాం డ్‌కు తరలిం చినట్లు సీఐ వెల్లడించారు. త్వరగా ఈ కేసును చేదించడంపట్ల జిల్లా ఎస్పీ, సీఐని సిబ్బందిని అభినందించినట్లు తెలిపారు.



నిందితుల అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న సీఐ యతీంద్ర

నేటి నుంచి విద్యావైజ్ఞానిక తరగతులు

అనంతపురం సెంట్రల్, సెప్టెంబరు 1: పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో సోమవారం నుంచి విద్యావైజ్ఞానిక తరగతులు నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వీరేంద్ర ప్రసాద్ తెలిపారు. ఆదివారం రోడ్లు, భవనాల అతిథిగృహంలో మీడియా సమావేశాన్ని ఏర్పాటుచేశారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భాస్కర్ మాట్లాడుతూ మేధావులు, విద్యావేత్తలు, శాస్త్రవేత్తలు, పారిశ్రామిక వేత్తలు, రాజకీయ నాయకులు విద్యాసంస్థలు చెక్కిన శిల్పాలన్నారు. అయితే సమాజహితాన్ని మరచిపోయి కార్పొరేట్ శక్తుల బానిసలుగా తయారవుతున్నారని పేర్కొన్నారు. ఇలాంటి రుగ్మతులకు భవిష్యత్తులో నేటి విద్యార్థులు లోనుకాకుండా విద్యావైజ్ఞానిక తగరతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నాయకులు శంకర్, తేజ, నరేష్, రాఘవేంద్ర, అభి, ఆంజనేయలు పాల్గొన్నారు.

సంగీతం, సాహిత్యం మూర్తీభవించిన వ్యక్తి నారాయణాచార్యులు

అనంతపురం కల్చరల్, సెప్టెంబరు 1: సంగీతం, సాహిత్యం మూర్తీభవించిన వ్యక్తి పుట్టపర్తి నారాయణాచార్యులు అని పలువురు వక్తలు కొనియాడారు. పద్మశ్రీ పురస్కార గ్రహీత పుట్టపర్తి నారాయణాచార్యులు వర్ధంతిని పురస్కరించుకుని ఆదివారం స్థానిక లలితకళాపరిషత్‌లో వివిధ సాహితీ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో పుట్టపర్తి నారాయణాచార్యులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పరిషత్ అధ్యక్షుడు వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ నారాయణాచార్యులు పిన్నవయసులోనే భారతం, భాగవతం, పురాణాలతోపాటు సంగీతం అవపోసన చేసిన గొప్ప వ్యక్తి అని పేర్కొన్నారు. ఎస్కేయూ తెలుగు శాఖ అకడమిక్ కన్సల్టెంట్ డాక్టర్ నానీల నాగేంద్ర, తెలుగు వెలుగు సాహిత్య సామాజిక సేవా సంస్థ అధ్యక్షుడు టీవీ రెడ్డి మాట్లాడుతూ నారాయణాచార్యులు శివతాండవం, అగ్నివీణ, మేఘదూతం వంటి కావ్యాలు రచించి తెలుగు సాహితీలోకంలో అగ్రస్థానంలో నిలిచారన్నారు.

8నుంచి యూటీఎఫ్ క్రీడాపోటీలు

పెనుకొండ, సెప్టెంబరు 1 : యూటీఎఫ్ ఆవిర్భవించి 50ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా యూటీఎఫ్ స్వర్ణోత్సవాల్లో భాగంగా మడకశిరలో 8నుంచి క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు అధ్యక్ష, కార్యదర్శులు జయచంద్రారెడ్డి, సుధాకర్, తెలిపారు. ఆదివారం యూటీఎఫ్ నాయకులతో కలిసి స్థానిక సీఐ కార్యాలయంవద్ద సీఐ రాఘవన్ చేతులమీదుగా బ్యానర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు బూతప్ప, నారాయణస్వామి, నబీ, కృష్ణానాయక్, రవీంద్రనాథ్, గోవిందప్ప, నరసింహులు, షన్ముఖ, శేషాద్రి తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు

మడకశిరటౌన్: పట్టణంలోని జూనియర్ కళాశాల మైదానంలో ఈనెల 8వతేదీన క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు భూతన్న ఆదివారం ప్రకటనలో తెలిపారు. యూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం ఆవిర్భవించి 50 సంవత్సరాలు పూర్తి చేసుకొన్న సందర్భంగా నిర్వహించే పోటీల్లో షటిల్ బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, వాలీబాల్ టోర్నమెంట్‌లు, 100, 200, 400 మీటర్ల పరుగుపందేలు, షాట్‌పుట్, జావలిన్‌త్రో, క్యారమ్స్ మొదలైన ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



బ్యానర్లను ఆవిష్కరిస్తున్న సీఐ రాఘవన్



దొంగల అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ, సీఐ

ఒంటరిగా వెళ్లేవారే టార్గెట్

● దారి దోపిడీ దొంగలను అరెస్ట్ చేసిన పోలీసులు

హిందూపురం, సెప్టెంబరు 1 : పట్టణానికి సమీపంలోని పారిశ్రామికవాడలో ఒంటరిగా వెళ్తున్నవారిని టార్గెట్‌చేసి దారిదోపిడి చేస్తున్న ఇద్దరు దుండగులను అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ మహేష్, సీఐ ఆంజనేయులు తెలిపారు. ఆదివారం అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయ న మాట్లాడుతూ పట్టణంలోని కోట ప్రాంతానికి చెందిన షేక్ అబూబకర్ సిద్దిక్, మహ్మద్ ముజాహిద్ కొంతకాలంగా పారిశ్రామికవాడలో పట్టపగలే ఒంటరిగా వెళ్తుంటే వారిపై దాడిచేసి నగదు, సెల్‌ఫోన్‌ను ఎత్తుకెళ్తున్నారు. వారం రోజుల క్రితం పారిశ్రామికవాడలో సమీపంలో ఒంటరిగా వెళ్తున్న ఓ వ్యక్తిని గాయపరిచి అతని వద్ద నుంచి నగదు, సెల్‌ఫోన్ ఎత్తుకెళ్లారు. బాధి తుడు అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేపట్టిన సీఐ ఇద్దరు దుండగులను అరెస్ట్ చేసి వారి నుంచి సెల్‌ఫోన్‌లు, ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఎవరైనా ఒంటరిగా వెళ్తున్నప్పుడు ఇలాంటి సంఘటనలు జరిగితే వెంటనే పోలీసులకు ధైర్యంగా సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఈ కేసుల్లో కీలకంగా వ్యవహరించిన సీఐ, సిబ్బందిని డీఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

జూదరుల అరెస్టు

రొళ్ల, సెప్టెంబరు 1 : పేకాట స్థావరాలపై దాడి చేసిన పోలీసులు పది మంది జూదరులను అరెస్ట్ చేశారు. ఎస్పీ ఆదేశాల మేరకు మడకశిర సీఐ ఆధ్వర్యంలో మండలంలోని రత్నగిరి గ్రామంలో గుట్టలవద పేకాట స్థావరాలపై ఎస్ఐ రాజశేఖర్ తమ సిబ్బందితో దాడి చేశారు. మొత్తం 38 మందిపై కేసు నమోదు చేయగా అందులో 28 మంది పరారీలో ఉన్నారు. రూ.1,02,550 నగదు, 8 సెల్‌ఫోన్లు, 7 మోటారు సైకిళ్లు స్వాధీనం చేసుకొన్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఉత్సవాలకు అనుమతి తప్పనిసరి: సీఐ



మాట్లాడుతున్న సీఐ శేఖర్

గోరంట్ల, సెప్టెంబరు 1: వినాయక చవితి సందర్భంగా వినాయక ప్రతిమలు, మండపాలు ఏర్పాటు చేసే వారు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని సీఐ శేఖర్ పేర్కొన్నారు. ఆదివారం గోరంట్ల పోలీస్ స్టేషన్‌లో మండల వ్యాప్తంగా విగ్రహాలు ఏర్పాటు చేసేవారితో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్రభుత్వ ఆదేశాలు పాటించాలన్నారు. ఆన్‌లైన్ ద్వారా అనుమతి పొంది విగ్రహాలను ఏర్పాటు చేయాలని, మూడురోజుల్లో తప్పనిసరిగా నిమజ్జనం చేయలన్నారు. మండపాల వద్ద విద్యుత్ ప్రమాదాలు సంభవించకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. రాత్రి సమయంలో అక్కడే ఉంటూ, భద్రత పాటించాలన్నారు. నిమజ్జన సమయంలో పిల్లల విషయంలో జాగ్రత్త వహించాలని, యువకులు మద్యం సేవించడం, మహిళలపై రంగులు చల్లడం లాంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు. వివిధ పార్టీలనాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

పైపులైన్‌కు మరమ్మతులు



పైపులను పరిశీలిస్తున్న డీఈ మునినాయక్



గ్రామంలో పారిశుధ్య పనులు చేపట్టిన దృశ్యం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అగళి, సెప్టెంబరు 1: మండలంలోని ఇనగలూరు గ్రామంఎస్సీ కాలనీలో పైపులైన్ లీకేజీలను ఆదివారం డీఈ మునినాయక్ పరిశీలించారు. గ్రామంలో డెంగీ వ్యాధితో బాధ పడుతున్న బాలుడి కథనం ఆంధ్రజ్యోతిలో ప్రచురితం కావడంపై అధికారులు స్పందించారు. పైపులైన్ లీకేజీతో కలుషిత చేరి రోగాల భారిన పడుతుండంపై చర్యలు చేపట్టారు. స్పందించిన ఆర్‌డబ్ల్యుఎస్ డీఈ మునినాయక్, విజయ్‌కుమార్ గ్రామానికి చేరుకుని పైపులను పరిశీలించారు. మరమ్మ తులు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. విస్తరణ అధికారి పద్మా, ఆర్‌డబ్ల్యూఎస్ అసిస్టెంట్ ఇంజనీర్ విజయ్‌కుమార్, ఇనగలూరు, పంచాయతీ కార్యదర్శి అశోక్ పాల్గొన్నారు.

వైభవంగా అంజన్న రథోత్సవం



భారీ జన సందోహం మధ్య స్వామివారి రథోత్సవం

బొమ్మనహాళ్, సెప్టెంబరు 1: మండలంలోని నేమకల్లు గ్రామంలో వెలసిన ఆంజనేయస్వామి రథోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. ఏటా శ్రావణమాసంలో ఆదివారం ఉదయం ఉత్సవం, రథోత్సవం జరిపిస్తారు. వేకువజామున స్వామివారి ఉత్సవాన్ని భారీ జనసందోహం మధ్య నిర్వహించారు. సాయంత్రం 4 గంటలకు రథోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ముఖ్య అతిథిగా హాజరై స్వామివారికి పూజలు జరిపారు. అనంతరం రథాన్ని లాగారు.